PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 131 | విజయవాడ, బుధవారం 13 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 13 December 2023 | Rs

మళ్లీ ఎగిసిన ధరలు

- 5.55 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

లోపలి పేజీలో..

గుంటూరు కమిషనర్‌కు జైలు శిక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కోర్టు ఉత్తర్వులను అమలు చేయనందుకు కోర్టు ధిక్కరణ కింద గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చేకూరి కీర్తికి నెల రోజులపాటు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ హైకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. గుంటూరు కొత్తపేటలోని యడవల్లి వారి సత్రానికి చెందిన 3,300 గజాల స్థలాన్ని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కాసుశాయమ్మ పేరుతో పాఠశాల నిర్వహిస్తున్నారు. దేవాదాయశాఖకు చెందిన స్థలాన్ని కార్పొరేషన్ అధికారులు ఆక్రమించుకొని ఎటువంటి లీజ్ చెల్లించకుండా పాఠశాల నిర్వహిస్తున్నారంటూ గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు రూ.25 లక్షలు చెల్లించాలని కార్పొరేషన్‌ను ఆదేశించింది. ఈ ఆదేశాలను మున్సిపల్ కమిషనర్ అమలు చేయడంలేదంటూ పిటిషనర్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. మున్సిపల్ కమిషనర్‌కు జైలు శిక్ష, జరిమానా విధించింది. జనవరి 2న హైకోర్టు రిజిస్ట్రారు వద్ద లొంగిపోవాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ధాన్యం సేకరణపై క్యాంపు ఆఫీసులో మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమైన సిఎం జగన్

ప్రతి గింజనూ కొంటాం

అవసరమైతే నిబంధనలు సడలిస్తాం : సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతుల వద్ద ఉన్న ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం. అవసరమైతే నిబంధనలు సడలిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన తుపాన్ కారణంగా రాష్ట్రంలో దెబ్బతిన్న పంటలుల, రంగుమారిన ధాన్యం కొనుగోళ్ల అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను బాధిత ప్రాంతాల్లో రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాట్లు తెలిపారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేస్తోందని చెప్పారు. 'ప్రతి గింజను కొనుగోలు చేయాలని వారికి చెప్పాం. అలా చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది.' అని ఆయన అన్నారు. ఇదే విషయాన్ని రైతులకు వివరించాలని, వారిలో ధైర్యాన్ని నింపాలని ఈ సమీక్షకు హాజరైన అధికారులు, తుపాన్ ప్రభావిత ప్రాంత ఎంఎల్‌ఏలకు చెప్పారు.

ధాన్యం కొనుగోలు విషయంలో ఉదారంగా వ్యవహరించాలని అధికారులను కోరారు. కోనుగోళ్లకు ఆటంకంగా ఏవైనా నిబంధనలు ఉంటే వాటిని సడలించాలని సూచించారు. ఆర్‌బికెల ద్వారా కొనుగోళ్లు జరుగుతాయని, ధాన్యాన్ని కొనుగోళ్లు చేసి, మిల్లులకు పంపే బాధ్యతను పౌరసరఫరాల శాఖ అధికారులు తీసుకోవాలని చెప్పారు. తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు సకాలంలోనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకుందన్నారు. పంటనష్టపోయిన రైతులకు వైయస్సార్ ఉచిత బీమాకింద పరిహారం అందించడానికి అనుసరించాల్సిన ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభమైందా.. అని ఆయన అధికారులను ఆరా తీశారు. దీనికి వారు 11వ తేది నుండి ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభమైందని,. 18వ తేది వరకు సాగుతుందని జవాబిచ్చారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలను 19 నుంచి 22 వరకు సోషల్ ఆడిట్ కోసం ఆర్‌బికెలలో వుంచుతున్నట్లు తెలిపారు. ఆ తర్వాత 23వ తేదీ నుండి 25 వరకు సవరణలు, అభ్యంతరాల స్వీకరస్తారని , 26న జిల్లా కలెక్టర్లు తుది జాబితాలు ప్రభుత్వానికి పంపుతారని తెలిపారు. అనంతరం సిఎం మాట్లాడుతూ సంక్రాంతిలోగా ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందాలని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు కొడాలి నాని, పేర్ని నాని, వల్లభనేని వంశీ, సామినేని ఉదయభాను, సింహాద్రి రమేష్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ సి హరికిరణ్, పౌరసరఫరాల శాఖ ఎండి వీరపాండ్యన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమరోత్సాహంతో సమ్మె

రాష్ట్ర వ్యాప్తంగా మూతబడిన అంగన్‌వాడీ కేంద్రాలు

- చర్చల పేరుతో ప్రభుత్వ బెదిరింపులు
- నేటినుండి మరింత ఉధృతం : సంఘాల ప్రకటన

కృష్ణాజిల్లా కానూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, పాల్గొన్న కె.సుబ్బరావమ్మ, తదితరులు

ప్రజాశక్తి- యంత్రాగం

అంగన్‌వాడీలు సమరోత్సాహంతో సమ్మె నగరా మోగించారు. పదేపదే విజ్ఞప్తులు చేసినా స్పందించని సర్కారు తీరును నిరసిస్తూ ప్రదర్శనలు, ధర్నాలు, దీక్షలతో కదం తొక్కారు. గర్భిణిలు, బాలింతలు, చిన్న పిల్లలకు సేవలందించే అంగన్‌వాడీ రంగం మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా స్థంభించింది. అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. పలుచోట్ల చంటి పిల్లలతో సహా ఆందోళన కార్యక్రమాలకు తరలివచ్చారు. దీంతో ప్రభుత్వం చర్చల పేరుతో బెదిరింపులకు దిగింది. చర్చలకు పిలిచిన ఉన్నతాధికారులు సిఎం పేరుతో సమ్మెకు పిలుపునిచ్చిన మూడు సంఘాల నేతలను బెదిరించే ప్రయత్నం చేశారు. ఈ వైఖరి కారణంగా చర్చలు విఫలమైనాయి. దీంతో బుధవారం నుండి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రకటించాయి. అంతకుముందు మంగళవారం ఉదయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు విధులు బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు ఎక్కడికక్కడ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీలు, ధర్నాలు, దీక్షలతో కలెక్టరేట్లు, ఐసిడిఎస్ ప్రాజెక్టు కేంద్రాలు మారుమ్రోగాయి. తెలంగాణాలో కంటే ఎక్కువ వేతనం ఇస్తామని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫేస్‌యాప్ విధానం రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, గ్రాట్యూటీ, పెన్షన్ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమ్మెతో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, మినీ కేంద్రాలు మూతబడ్డాయి. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)తోపాటు ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ సంఘాల నాయకులు తెలిపారు. అంగన్‌వాడీల సమ్మె శిబిరాలను సిపిఎం, టిడిపి, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఇతర ప్రజాసంఘాల నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. విశాఖలోని మద్రిపాలెం, అన్నమయ్య జిల్లా మదనపల్లి ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళనలో చంటి పిల్లలతో సహా పాల్గొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో విఎస్‌ఆర్ కళాశాల ఎదుట ప్రధాన రహదారిపై అంగన్‌వాడీలు మిగతా 7లో

సమ్మెలోవుంటే సిఎం తొలగించమన్నారు

తక్షణం విరమించకపోతే సమ్మెలో ఉన్న వారినందర్నీ ఉద్యోగాల్లోంచి తొలగించాలని సిఎం ఆదేశించారని ఉన్నతాధికారులు సంఘాల నాయకుల్ని బెదిరించారు. సమ్మె పెద్దఎత్తున సాగుతుండటంతో మంగళవారం సాయంత్రం మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి నాయకులను చర్చలకు ఆహ్వానించారు. అయితే, సమస్యలను పరిష్కరించే దిశగా కాకుండా బెదిరించి సమ్మెను విరమింపచేయాలని అధికారులు ప్రయత్నించారు. చిన్న చిన్న సమస్యలు తప్ప జీతాల పెంపువంటి కీలకమైన అంశాలపై చర్చించేదే లేదని సంఘాల నాయకులకు అధికారులు స్పష్టం చేశారు. వెంటనే సమ్మెను విరమించాలని, లేనిపక్షంలో ఎంతమంది సమ్మెలో ఉన్నారో వారందరినీ తొలిగించాలని సిఎం ఆదేశించారన్నారు. దీంతో చర్చలు విఫలమయ్యాయి. అనంతరం సంఘాల నాయకులు విజయవాడలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ప్రభుత్వ బెదిరింపులకు లొంగేది లేదని, సమస్య పరిష్కారం అయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని హెచ్చరించారు. చర్చల్లో సిఐటియు అనుబంధ సంఘం నుండి కె.సుబ్బరావమ్మ, జి. బేబీరాణి, ఎన్‌యుహెచ్ సుప్రజ, ఎఐటియుసి నుండి జె. లలితమ్మ, ప్రేమ, ఐఎఫ్‌టియు నుండి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఫైబర్‌నెట్ కేసుపై బహిరంగ వ్యాఖ్యలొద్దు

- చంద్రబాబు, ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఫైబర్‌నెట్ కేసుపై బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్‌ను నిరాకరించిన హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంలో చంద్రబాబు పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. స్కిల్ కేసులో 17 ఏపై తీర్పు వెలువరించాల్సి ఉన్నందున ఫైబర్‌నెట్ కేసును జనవరి 17కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను గత నెలలో విచారించిన అత్యున్నత న్యాయస్థానం, చంద్రబాబు కేసుపై మాట్లాడకుండా బెయిల్ షరతును కొనసాగించాలని ఆదేశించింది.

ఇన్‌ఛార్జీల మార్పులు బదిలీలు

వ్యతిరేకత తప్పించుకునేందుకా!

- తెలంగాణా తీర్పుతో ముందు జాగ్రత్త



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గ ఇన్‌ఛార్జుల మార్పు రాష్ట్ర రాజకీయాల్లో దుమారాన్ని రేపింది. ఇది ఇంతటితో ఆగదని కనీసం 50 నుండి 60 నియోజకవర్గాల్లో మార్పులు చేర్పులు జరుగుతాయనే చర్చ ఇప్పుడున్న వారిలో అలజడి రేపింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజా వ్యతిరేకత నుండి బయటపడాలనే ఉద్దేశంతోనే వైసిపి ఇలాంటి నిర్ణయం తీసుకుందనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. కొద్దిమంది నిర్వాకం వల్ల పార్టీకి నష్టం వచ్చిందని, తాము మంచిపాలన చేస్తున్నామనే అభిప్రాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మార్పులు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

తెలంగాణాలో జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ వ్యతిరేకత మూటగట్టుకున్న నేపథ్యం, అక్కడ ఎమ్మెల్యేలను మార్చిన కొద్ది స్థానాల్లో మంచి ఫలితాలు రావడాన్ని పరిగణలోకి తీసుకుంటున్నారు. బిఆర్ఎస్ తరుపున అక్కడ సర్వేలు నిర్వహించి నిరంతరం ఎన్నికల వ్యవహారాన్ని నడిపిన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్యే ఒకరు ఈ మార్పులు చేర్పుల్లోనూ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అక్కడ ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలను మార్చిన స్థానాల్లో అభ్యర్థులు విజయం సాధించారని, ఇక్కడ కూడా అదే వ్యూహం అమలు చేసి ప్రజల్లో వ్యతిరేకత లేకుండా చేసుకోవాలని వైసిపి అధినాయకత్వం భావిస్తున్నట్లు తెలిసింది. మార్చిన వారందరూ ఓడిపోయేవారు కాదని, సామాజిక సమీకరణల్లో భాగంగా సిఎం ఈ నిర్ణయం తీసుకున్నారని సీనియర్ నాయకులు వై.వి.సుబ్బారెడ్డి ప్రకటించారు. అదే నిజమైతే తొలిసారి జరిగిన మార్పుల్లో ఎక్కువ సీట్లు ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గాలే ఉన్నాయని, ఇద్దరు మంత్రులూ వారేనని, ఇది సామాజిక సమీకరణ ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. వ్యక్తులను మార్చినంత మాత్రాన వ్యతిరేకత పోతుందా అనే ప్రశ్న వస్తోంది. దీనిపై బొత్స లాంటి సీనియర్ మంత్రులు మాట్లాడుతూ సిఎం గత సమీక్షల సమయంలో మార్పుల గురించి ప్రస్తావించారని, అదే ఇప్పుడు చేశారని చెబుతున్నారు. ఎంత ప్రక్షాళన చేసినా ఒకేసారి ముగ్గురు మంత్రులను మార్చడంపైనే చర్చంతా నడుస్తోంది. ఒకటీ రెండు రోజుల్లో కృష్ణాజిల్లాతోపాటు రెండు మూడు ఉమ్మడి జిల్లాల్లో మార్పులు చేయనున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని దీనిపై మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సిఎం ఇప్పటికే మార్పులపై స్పష్టమైన నిర్ణయానికి వచ్చారనీ ఎక్కడ, ఎవరిని నిర్ణయిస్తే వారు పోటీచేస్తారని ప్రకటించారు. ఎన్నికలకు ఆరునెలల ముందు నుండే అభ్యర్థులను ఏర్పాటు చేసుకోవాల్సి ఉండటంతో సిఎం వేగంగా నిర్ణయం తీసుకున్నారనీ చెబుతున్నారు.

వాళ్లు ఎలా గెలుస్తారు ?

సామాజిక సమీకరణాల్లో చూసినా మార్పులు చేర్పులు జరిగిన ముగ్గురు మంత్రుల్లో ఒకరు బిసి, ఇద్దరు ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గాల నుండి గెలిచినవారే కావడం విశేషం. వీటితోపాటు మరో రెండు ఎస్‌సి నియోజకవర్గాలూ ఉన్నాయి. ఇప్పటికే అసంతృప్తితోనూ, సీట్లు ఆశిస్తున్న ద్వితీయశ్రేణి వైసిపి నాయకుల్లో దీనిపై తీవ్ర మిగతా 7లో

రైలులోనే మహిళపై అత్యాచారం

- మధ్యప్రదేశ్‌లో దారుణం

భోపాల్ : కదులుతున్న రైలులో మహిళపై అత్యాచారానికి పాల్పడిన దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. సత్నా జిల్లా ఉంచెరా వెళ్లేందుకు కట్ని రైల్వే స్టేషన్‌లో 30 ఏళ్ల మహిళ ఒక ప్యాసింజర్ రైలు ఎక్కింది. ఆ రైలు పట్నారియా స్టేషన్‌లో నిలిచిపోయింది. దీంతో వాష్‌రూమ్ అవసరాల కోసం ఆమె అదే స్టేషన్‌లో వేరొక ఫ్లాట్‌ఫామ్‌పై ఆగివున్న ఒక స్పెషల్ ట్రెయిన్‌లోని ఎసి కంపార్ట్‌మెంట్‌లో ప్రవేశించింది. ఆమెను వెంబడిస్తూ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కమలేష్ కుష్వాహ ఆ కంపార్ట్‌మెంట్ డోర్ లాక్ చేశాడు. ఆ కంపార్ట్‌మెంట్ అంతా ఖాళీగా ఉంది. ఆ రైలు కదలడం ప్రారంభిం చగానే మహిళను కొట్టి, చిత్రహింసలకు గురిచేశాడు. చంపేస్తానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ రైలు సత్నా స్టేషన్‌కు చేరుకోగానే బాధిత మహిళ కిందకు దిగి ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్‌కు తనపై జరిగిన అత్యాచార విషయాన్ని తెలిపింది. సిబ్బంది కోచ్ వద్దకు వచ్చేసరికి రైలు బయలుదేరిపోయింది.

ఆర్‌పిఎఫ్ సిబ్బంది రావడం చూసిన కమలేష్ కోచ్ తలుపులకు తాళం వేసి అందులో దాక్కున్నాడు. స్టేషన్ మాస్టర్ తరువాతి స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్‌పిఎఫ్ సిబ్బంది కూడా రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్లారు. రైలు రేవా స్టేషన్‌కు చేరుకున్న తరువాత అక్కడి మెకానిక్ బృందం సహాయంతో తలుపుల్ని తెరిచారు. మూడు గంటలపాటు దాక్కున్న కమలేష్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు.

పొగాకు పంటను పరిశీలిస్తున్న వి శ్రీనివాసరావు

పరిహారం వెంటనే చెల్లించండి

- తుపానుకు దెబ్బతిన్న పంటల పరిశీలించిన సిపిఎం బృందం 3

రాజస్థాన్ సిఎంగా భజనలాల్ శర్మ

- వసుంధర రాజేకు మొండిచేయి 7

పోలీస్ దాష్టీకానికి

దళిత యువకుడు బలి!

- స్టేషన్ ఆవరణలోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ఆరో రోజుల అనంతరం మృతి

ప్రజాశక్తి- యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

యర్రగొండపాలేనికి చెందిన మోజేష్ చికిత్స పొందుతూ ఆరు రోజులపాటు మృత్యువుతో పోరాడి గుంటూరులో మంగళవారం మరణించారు. ఆయన మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. స్థానికుల కథనం ప్రకారం... యర్రగొండపాలెం పట్టణానికి చెందిన ఎస్‌సి యువకుడు నాగెపోగు మోజేష్ (19) దూరవిద్యలో డిగ్రీ చదువుతున్నారు. మాచర్ల రోడ్డులోని రాళ్ల వాగు బ్రిడ్జి పక్కన కొందరు యువకులు గొడవ పడుతున్నట్లు తెలుసుకొని పోలీసులు ఈ నెల ఐదున ఉదయం అక్కడికి వెళ్లారు. ఈ సమయంలో అక్కడే ఉన్న మోజేష్, సుభాని అనే యువకులను స్టేషన్‌కు తీసుకొచ్చారు. కౌన్సెలింగ్ పేరిట వారిని తీవ్రంగా కొట్టారు. మోజేష్ తండ్రిని పిలిచి ఇష్టమొచ్చినట్లు దూషించడం, తర్వాత రోజు కూడా మళ్లీ స్టేషన్‌కు రప్పించి కొట్టడంతో పాటు తన తండ్రిని సైతం దుర్భాషలాడడంతో మోజేష్ మనస్తాపానికి గురై పోలీసు స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ యువకుడిని పోలీసులు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేయలేదు.

మృతి చెందిన మోజేష్ (ఫైల్)

అనంతరం మోజెస్‌ను ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యం చేసేందుకు నిరాకరించారు. దీంతో, ఆ యువకుడి కుటుంబ సభ్యులతో పోలీసులు రాజీ ప్రయత్నాలు మొదలు పెట్టారు. అర్ధరాత్రి సమయంలో యువకుడిని చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆరు రోజులపాటు మృత్యువుతో పోరాడిన మోజేష్ మంగళవారం చనిపోయాడు. దీంతో, గుంటూరులోని ప్రయివేటు వైద్యశాల ఎదుట మృతదేహంతో కుటుంబసభ్యులు, బంధువులు ధర్నా చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పలు దళిత సంఘాల నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి సురేష్ భరోసా ఇచ్చారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.

డేరా ఇస్మాయిల్ ఖాన్‌లో ఉగ్రవాద దాడికి ధ్వంసమైన స్థావరాన్ని పరిశీలిస్తున్న జవాన్

పాక్‌లో ఉగ్ర పంజా

- 25మంది సైనికులు మృతి
- ఎదురు కాల్పుల్లో 27 మంది తీవ్రవాదుల హతం

7

మొక్కుబడిగా కరువు బృందం పర్యటన

- పొద్దుపోయాక పొలాల్లోకి

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

కేంద్ర కరువు బృందం అనంతపురం జిల్లా పర్యటన మొక్కుబడిగా సాగింది. సాయంత్రం పొద్దుగూగాక పంట పొలాల పరిశీలన సాగింది. భారత వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ నేతృత్వంలో పది మంది సభ్యుల కేంద్ర బృందం మంగళవారం అనంతపురం జిల్లాకు వచ్చింది. 11.30 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఈ బృందం మధ్యాహ్నం 1.30 గంటల వరకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైంది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది. ఈ సమీక్షకు మీడియాకు అనుమతించలేదు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు పంటల పరిశీలనకు మూడు బృందాలుగా బయలుదేరి వెళ్లింది. వీటిలో ఒక బృందం అనంతపురం రూరల్ మండలం కందుకూరులో, ఆత్మకూరు మండలం తలుపూరులో పర్యటించింది. వేరుశనగ, కంది రైతులతో మాట్లాడింది. పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఈ బృందం దృష్టికి తీసుకొచ్చారు. మరో బృందం కల్యాణదుర్గంలోనూ, గుమ్మగట్ట మండలం 75 వీరాపురం గ్రామంలోనూ పర్యటించింది. ఇక్కడ వేరుశనగ, కంది, ఆముదం పంటలను పరిశీలించింది. మూడవ బృందం గుత్తి మండలం వన్నేదొడ్డిలో వేరుశనగ, కంది పంటలను, పామిడి మండలంలో పత్తి పంటను పరిశీలించింది. కాగా, కేంద్ర బృందం బుధవారం శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించనుంది.

అనంతపురం రూరల్ పరిధిలోని కందుకూరు గ్రామంలో ఎండిన కంది పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

అడగడమే ఆత్తేసరు!

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కరువు వల్ల పంట నష్టం అంచనాలను రూపొందించింది. దీని ప్రకారం అనంతపురం జిల్లాలో జరిగిన పంట నష్టానికి రూ.251.20 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇప్పుడొచ్చిన కరువు బృందం ముందు మాత్రం వ్యవసాయానికి సంబంధించి ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు ప్రతిపాదించినది రూ.158.63 కోట్లు మాత్రమే. మిర్చి పంటకు రూ.43.17 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. మొత్తంగా వ్యవసాయానికి సంబంధించి రూ.201.80 కోట్లకు ప్రతిపాదనలు చేశారు. పశుసంవర్ధక శాఖకు రూ.1.74 కోట్లు, గ్రామీణ నీటి సరఫరాకు రూ.7.04 కోట్లు, పట్టణ తాగునీటి సరఫరాకు రూ.2.72 కోట్లు, ఉపాధి హామీకి రూ.116.52 కోట్లు కలిపి మొత్తం రూ.329.82 కోట్లు ప్రతిపాదించారు. ఉపాధి హామీ వేతనాలకు రూ.69.90 కోట్లు, మేటీరియల్ కంపోనెంట్‌కు రూ.46.62 కోట్లు ప్రతిపాదించారు.

రైతులను ఆదుకోవాలని సిపిఎం వినతి

జిల్లాలో కరువు నెలకొన్న తరుణంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కేంద్ర కరువు బృందాన్ని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. స్కేలు ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని కోరారు. రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు నష్టపరిహారం అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి రేషన్ కార్డుదారునికీ కందిపప్పు ఇవ్వాలి : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రతి రేషన్ కార్డుదారునికి కందిపప్పు అందించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్‌కు మంగళవారం లేఖ రాశారు. గత నెలలో కందిపప్పు పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, నేటి వరకు అందరికీ కందిపప్పు అందలేదని తెలిపారు. రేషన్ కార్డుదారులందరికీ కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వానికి నిత్యావసర సరుకులను సరఫరా చేయాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబరుకు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పిన సూచనలను సూటిగా పత్రికకు అందిస్తాం. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బిజెపి మళ్లీ నయవంచన!

- రైల్వే జోన్‌పై 2014 నుంచీ ఇదే కాలయాపన
- 'న్యూ ఇయర్ 2024'లో ప్రధాని మోడీ వస్తారంటూ మరో వాయిదా!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు మళ్లీ బ్రేక్ పడింది. బిజెపి సర్కారు ఒక మోసంపై మరో మోసానికి పాల్పడుతూ 2014 నుంచీ విశాఖకు ద్రోహాన్ని తలపెడుతోంది. ఎనిమిదేళ్లుగా పూటకో మాట, రోజుకో ప్రకటనతో ఈ ప్రాంత ప్రజల ఆశలపై నీళ్లు జల్లుతోంది. రైల్వే జోన్‌పై కేంద్రం నాటకాలపై ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, టిడిపి, జనసేన పార్టీ ప్రశ్నించకపోవడంపై ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజానీకంలో ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. రైల్వే జోన్‌పై రాజ్యసభలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా వివరణ ఇస్తూ 2024 కొత్త సంవత్సరంలో దేశ ప్రధాన మంత్రి సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు పునాదిరాయి వేస్తారంటూ మరోసారి ఊరించారు. మరోపక్క విశాఖలోనే తిష్టవేసి కూర్చున్న బిజెపి పెద్దలు జివిఎల్ నరసింహారావు... రైల్వే జోన్ నిర్మాణం జరిగిపోతుందంటూ కపట ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన కేంద్రాన్ని కాపాడేందుకు ఆర్‌ఐఎన్‌ఎల్ నష్టాలకు గత ప్రభుత్వాలే కారణమని, ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను కేంద్రం ఆపేసిందని, రైల్వే జోన్ ఏర్పాటుకు ఎంతో దూరం లేదని మంగళవారం రాజ్యసభలో ప్రకటించడం ఈ ప్రాంత ప్రజలు, కార్మికవర్గంలో ఆగ్రహాన్ని పెంచుతోంది.

రైల్వే మంత్రి విశాఖ పర్యటనలోనూ ఇదే మాట!

ఈ నెల తొమ్మిదిన విశాఖ జిల్లాలోని సింహాచలం రైల్వే స్టేషన్ పర్యటనకు విచ్చేసిన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, 'రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమి క్లియర్ అప్పగింత జరగనందునే కొత్త సంవత్సరంలో మరలా ప్రధాన మంత్రి మోడీ వచ్చి రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తార'ని ప్రకటించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఏపి విభజన హామీల్లో అత్యంత కీలకమైన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు నూతన రైల్వే జోన్ వంటి అన్నింటినీ తుంగలో తొక్కుతూ హామీలకు తూట్లు పొడుస్తోంది బిజెపి. ఏపికి ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు పునర్విభజన చట్టం సెక్షన్ 93, షెడ్యూల్ (13)లో పేర్కొన్నా, 2016 సంవత్సరం నుంచీ నాన్చుతూనే ఉంది. 2019లో ఎన్నికలకు ముందు విశాఖ నగరంలో బిజెపి ర్యాలీ, సభకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ త్వరలోనే దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖలో ప్రారంభిస్తానని ప్రకటించి ఈ ప్రాంత ప్రజలు, రైల్వే ఉన్నతాధికారులు, ఉద్యోగుల్లో ఆశలు రేపారు. కానీ, కేంద్ర సర్కారు నయవంచన ఎంతకాలం? అంటూ తాజాగా వీరు ప్రశ్నిస్తున్నారు.

దిక్కూ మొక్కూలేని డిపిఆర్... రైల్వే జోన్ ఊసే ఎత్తని ప్రధాని

2020లో కేంద్ర రైల్వే బోర్డుకు పంపిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) రూ.10 కోట్లు ఇంతవరకూ ఆమోదం పొందలేదని వాల్తేరు రైల్వే డిఆర్‌ఎం కార్యాలయ ఉన్నతాధికారులు ఏకోన్ముఖంగా చెబుతున్నారు. గత ఏడాది నవంబర్ 11న విశాఖలో ప్రధాన మంత్రి మోడీ పర్యటనను రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. మంత్రి అశ్విని వైష్ణవ్, విశాఖలోని జివిఎల్ సహా అందరూ బిజెపి నేతలూ దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారంటూ ప్రచారం ఊదరగొట్టారు. ఆచరణలో ఇది కూడా తుస్సుమంది. ప్రధాని కనీసం రైల్వే జోన్ ఊసెత్తకపోవడం ఆ సందర్భంగా రైల్వే వర్గాలు, విశాఖ ప్రజల్లో చర్చనీయాంశమైంది.

న్యూజోన్ కోసం లే-అవుట్ కూడా సిద్ధం కాలేదు

రైల్వే డిఆర్‌ఎం కార్యాలయంలో 15 ఎకరాల స్థలం భవనాల కోసం సిద్ధంగా ఉన్నా భూమి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదంటూ రైల్వే మంత్రి, రాజ్యసభ సభ్యులు జివిఎల్ వంటి వారు అబద్ధాలను తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి గతంలో రైల్వే భూమి బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (బిఆర్‌టిఎస్) కోసం 2015లో 52.2 ఎకరాలను ముడసర్లోవలో రైల్వేకు రాష్ట్ర ప్రభుత్వం చూపించింది. దీంట్లో పది ఎకరాలు మాత్రమే వివాదంలో ఉంది. వివాద రహిత భూమిలో రైల్వే జోన్ పనులకు ఆటంకం ఏమిటి? అంటూ రైల్వే ఇంజనీరింగ్ అధికారులు వాపోతున్నారు.

భూమికి భవనాలకు లింకేమిటి : సిపిఎం

కేంద్రంలోని బిజెపికి చిత్తశుద్ధి ఉంటే స్థలం లేదంటూ రైల్వే జోన్ నిర్మాణ పనులను ఆపేయడం సరికాదని, జోన్ పనులు ప్రారంభించాలని, స్థలాలకు భవనాలకు లింకులు పెట్టి ఉత్తరాంధ్ర ప్రజలను బిజెపి మోసగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ నెల పదిన విశాఖ విచ్చేసిన సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా ఛానెల్స్‌తో మాట్లాడుతూ పేర్కొన్నారు.

జమ్ముకాశ్మీర్ బిల్లుకు వైసిపి మద్దతు హానికరం

- సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర నిరంకుశత్వాన్ని రుద్దుతున్న జమ్ముకాశ్మీర్ బిల్లులను వైసిపి పార్లమెంట్లో బలపరచడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర అప్రజాస్వామిక బిల్లులను బలపరచడమే కాకుండా మొత్తం కాశ్మీర్ చరిత్రనే వక్రీకరించి ఆర్‌ఎస్‌ఎస్ వాదనను పార్లమెంట్‌లో విజయసాయిరెడ్డి వినిపించారని తెలిపారు. బిజెపి ముస్లిం వ్యతిరేకతను గుడ్డిగా విజయసాయిరెడ్డి కూడా తలకెక్కించుకున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఇది దేశ చరిత్రను, స్వాతంత్ర్య ఉద్యమాన్ని పక్కదారి పట్టించడమేనని, జమ్ముకాశ్మీర్ బిల్లులో అసెంబ్లీలో నామినేషన్ పద్ధతి ద్వారా కేంద్రమే ఎమ్మెల్యేలను నియమిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను ఇది తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, ప్రజా తీర్పులను అపహాస్యం చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ఉపయోగపడుతుందని విమర్శించారు. ఇప్పటి వరకు రాష్ట్రాల అసెంబ్లీలకు శాసనసభ్యులను నామినేషన్ చేయడం రాష్ట్ర ప్రభుత్వాల హక్కుగా ఉందని, ఈ చట్టం ద్వారా కేంద్రానికి బదలాయించుకుందని మొత్తం ప్రజాస్వామ్య విలువలను, ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కేంద్రం తీరు ఉందని తెలిపారు. ఈ బిల్లులను పార్లమెంట్లో విజయసాయిరెడ్డి వెనకేసుకురావడం హానికరమని విమర్శించారు. జమ్ముకాశ్మీర్ శరణార్థుల గురించి మాట్లాడే సమయంలో రాజా హరిసింగ్‌ను ఆయన కొనియాడటం చరిత్రను వక్రీకరించడమేనని, రాజా హరిసింగ్ తొలుత స్వతంత్ర కాశ్మీర్‌ను ప్రకటించుకున్నారని తెలిపారు. ఆయన మూలంగానే ఆక్రమిత కాశ్మీరు (పిఒకె) పాకిస్తాన్‌కు వెళ్లిపోయిందని వివరించారు. అనంతరమే కాశ్మీర్ భారతదేశంలో విలీనమైందని, షేక్ అబ్దుల్లా ప్రజలను కూడగట్టి జమ్ముకాశ్మీర్‌ను భారతదేశంలో విలీనం చేయడంలో ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. పాకిస్తాన్‌లో కలవకుండా భారతదేశంలో కలిసినందుకు వారి ప్రత్యేక హక్కులు కొన్నిటిని గుర్తిస్తూ 370 ఆర్టికల్ రాజ్యాంగంలో చేర్చారని వివరించారు. ఈ వాస్తవాలు ఏమీ విజయసాయిరెడ్డి గుర్తించకపోవడం అన్యాయమని తెలిపారు. పురాతన చరిత్రలో జరిగిన ఘోరాలు పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ వక్రీకరించిన చరిత్రను విజయసాయిరెడ్డి వల్లె వేయడం వైసిపి స్వభావాన్ని ప్రశ్నిస్తోందని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్రాల హక్కులను పరిరక్షించేందుకు పార్లమెంటులో వైసిపి గట్టిగా నిలబడాలని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు కృషి చేయాలని, బిజెపికి వంత పాడటం మానుకుని ప్రజల తరపున నిలబడాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే 21 తర్వాత సమ్మెలోకి..

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ ప్రాంతాల్లో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఈ నెల 21 తర్వాత సమ్మెలోకి పోతామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పేర్కొంది. మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు విజయవాడలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె ధనలక్ష్మి దీక్షలను ప్రారంభిస్తూ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500కు గానూ కేవలం రూ.9 వేల రూ.12 వేలు చెల్లిస్తున్నారని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను కేబినెట్‌లో అజెండాగా పెట్టి చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, నాయకులు ఊరుకూటి రాజు, టి నూకరాజు, కోశాధికారి ఎస్ జ్యోతిబసు, సుంకర రవి, జానుబాబు, వెంకమ్మ, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను చర్చనీయాంశం చేసేందుకే...

- కర్నూలులో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు
- ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

రైతుల సమస్యలను చర్చనీయాంశం చేసేందుకే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను నిర్వహిస్తున్నామని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి తెలిపారు. కర్నూలులో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న ఈ సమావేశాల నేపథ్యంలో 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు.

సమావేశాలకు కర్నూలును ఎంచుకోవడానికి నేపథ్యం ఏంటి?

ప్రభాకరరెడ్డి : రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు. వెనకబడిన జిల్లాలో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం ద్వారా రాయలసీమ ప్రాంతంలోని సమస్యలను చర్చనీయాంశంగా చేసేందుకు ఉపయోగపడుతుంది. అఖిల భారత నాయకుల దృష్టికి సమస్యలు వెళ్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి పరిష్కరించుకునేందుకు వీలుంటుంది.

రైతు సంఘంగా చేపట్టిన ముఖ్యమైన ఆందోళనలు ఏవి?

ప్రభాకరరెడ్డి : కరువు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వాన్ని కరువుపై దృష్టి సారించేలా చేయగలిగాం. గత సంవత్సరం అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు తక్షణం నష్టపరిహారం ఇవ్వాలని జూన్‌లో ఆందోళనల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాం. దీంతో, జులైలో ప్రభుత్వం నష్టపరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. 2022 డిసెంబరులో ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో వర్షాల వల్ల ధాన్యం పాడయ్యే పరిస్థితి నెలకొన్నప్పుడు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ పేరుతో మిల్లర్లు అదనంగా డబ్బులు వసూలు చేయకూడదని, నాణ్యమైన గోనె సంచులు పంపిణీ చేయాలని ఆందోళన చేసిన ఆందోళన ఫలితంగా రైతులకు ఊరట లభించింది. కర్నూలు జిల్లాలో కల్తీ విత్తనాలు, భూసేకరణకు న్యాయమైన పరిహారం అందించేలా రైతులతో కలిసి ఆందోళనలు చేశాం. రైతులకు అండగా రైతు సంఘం నిలబడుతుందన్న భరోసా కల్పించాం.

సమావేశాల షెడ్యూల్ ఎలా ఉండనుంది?

ప్రభాకరరెడ్డి : ఈ నెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజులపాటు ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయి. 15న ఉదయం ప్రారంభ సభ, కార్యదర్శి నివేదిక ఉంటాయి. మధ్యాహ్నం కర్నూలు సుందరయ్య కూడలి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ రైతు ర్యాలీ, అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నాం. 16, 17 తేదీల్లో కార్యదర్శి నివేదికపై చర్చలు, తీర్మానాలు ఉంటాయి. 17 సాయంత్రానికి సమావేశాలు ముగుస్తాయి. సమావేశాల వేదికకు స్వాతంత్ర సమరయోధుడు, తమిళనాడు రైతు ఉద్యమ నాయకులు శంకరయ్య పేరుతో శంకరయ్య నగర్‌గా నామకరణం చేశాం.

సమావేశాలకు ఎవరెవరు హాజరుకానున్నారు?

ప్రభాకరరెడ్డి : సమావేశాలకు 27 రాష్ట్రాల నుంచి 140 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే, అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, టి.సాగర్, ఆర్థిక కార్యదర్శి కృష్ణప్రసాద్ తదితరులు హాజరు కానున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ, నోయిడాలో రైతు ఉద్యమం నడిపిన నాయకులు, వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేస్తోన్న వారు ప్రత్యేక ఆహ్వానితులుగా రానున్నారు.

ఏర్పాట్ల కోసం ఏం చర్యలు తీసుకున్నారు?

ప్రభాకరరెడ్డి : జాతీయ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు 20 సబ్ కమిటీలు ఏర్పాటు చేశాం. ప్రతి సబ్ కమిటీ బాధ్యతను ఒక ముఖ్య నాయకుడికి అప్పగించాం. వసతుల కమిటీ, భోజన కమిటీ, సాంస్కృతిక కమిటీ, వలంటీర్ల కమిటీ, రవాణా కమిటీ, బహిరంగ సభ ఏర్పాట్ల కోసం కమిటీ, ప్రచార నిర్వహణకు కమిటీని నియమించాం.

సమావేశంలో ప్రధానంగా వేటిపై చర్చించనున్నారు?

ప్రభాకరరెడ్డి : మద్దతు ధరల చట్టం, సమగ్ర పంటల బీమా, రైతుల రుణమాఫీ, విద్యుత్ రంగ సంస్కరణలు, పౌర హక్కులు, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవడం, ఫెడరల్ వ్యవస్థను రక్షించుకోవడం ప్రధాన అంశాలుగా బిజెపి ప్రభుత్వాన్ని రైతు, కార్మికుల సమైఖ్య పోరాటంతో మెడలు వంచేలా చర్చలు చేయనున్నారు.

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏంటి?

ప్రభాకరరెడ్డి : రాష్ట్రంలో 85 లక్షల రైతు కుటుంబాలు, 25 లక్షల కౌలు రైతుల కుటుంబాలు ఉన్నాయి. కౌలు రైతుల్లో పది లక్షల కుటుంబాలు సొంతంగా కొంత భూమిని కలిగి ఉండి, మరికొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయ చేస్తున్నారు. ఈ సంవత్సరం కరువు, తుపాను రైతులకు కీలక సమస్యలు. రాయలసీమ, ఉత్తరాంధ్రను కరువు, కోస్తాంధ్రను తుపాను వెంటాడింది. పంటలు పండక, పండినా గిట్టుబాటు ధర రాక, వ్యవసాయ పెట్టుబడులు పెరిగి రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అందుకే రూ.2 లక్షల వరకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

రైతులకు, ప్రజలకు మీరిచ్చే పిలుపు?

ప్రభాకరరెడ్డి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి. పార్టీలకతీతంగా ప్రజలందరూ ఈ నెల 15న కర్నూలులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించే బహిరంగ సభకు హాజరై జయప్రదం చేయాలి.

29న సదరన్ కౌన్సిల్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

31వ దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ (సదరన్ జోనల్ కౌన్సిల్) సమావేశం ఈ నెల 29న మహాబలిపురంలో జరగనుంది. ఇందుకు సంబంధించి సన్నాహకాలపై విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలు, ఇంకా పరిష్కారం కాని అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం- చెన్నై పారిశ్రామిక నడవా (విసిఐసి), రాష్ట్ర రాజధాని ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, ఆయుష్మాన్ భారత్, తెలంగాణ నుంచి రాష్ట్రానికి రావాల్సిన విద్యుత్తు బకాయిలు, పౌరసరఫరాల సంస్థకు రావాల్సిన నిధులు, రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వివిధ రాయితీలు, ఢిల్లీలోని ఎపి భవన్ విభజనకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

గ్రూప్ పోస్టులను 2 వేలకు పెంచాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన గ్రూప్1, 2 పోస్టులను 2 వేలకు పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలపై డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన చర్చావేదికను విజయవాడలోని భలోత్సవ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1లో 81 పోస్టులకు, గ్రూప్-2లో 897 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తరుణంలో నోటిఫికేషన్ వచ్చిందని, అయితే ఆశించిన స్థాయిలో పోస్టులను తీయలేదన్నారు. గత మూడేళ్ల క్రితమే వెయ్యి పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎపిపిఎస్‌సి ప్రకటించిందని, ఇప్పటికీ పోస్టులు పెంచలేదని అన్నారు. అలాగే గ్రూప్-2 పరీక్షలు నిర్వహించిన తరువాతనే గ్రూప్-1 నిర్వహిస్తే నిరుద్యోగులకు ఉపయోగం ఉంటుందని తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న మాట్లాడుతూ.. గ్రూప్-1, 2 పరీక్షల మధ్య సమయం ఇవ్వాలని కోరారు. ప్రతి ఏడాది జనవరిలో జాబ్ కేలండరు ఉంటుందని ప్రభుత్వం గతంలో చెప్పినప్పటికీ ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదన్నారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున వయోపరిమితి కనీసం 47 ఏళ్లకు పెంచాలని కోరారు. ఉచిత స్టడీ సర్కిల్‌ను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో తీసుకోవాలన్నారు. పరీక్షల్లో నెగిటివ్ మార్కులు పద్ధతిని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాజేష్, డివైఎఫ్ఐ నాయకులు పి కృష్ణ, నాగేశ్వరరావు, శివ, శ్రీనివాస్, నవీన్, కాంతారావు, ప్రజాపతి, దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించకపోతే కలెక్టర్ చర్యలు తీసుకుంటారు

- అంగన్‌వాడీలకు ప్రభుత్వ హెచ్చరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమ్మె కారణంగా బాలింతలు, పసిపిల్లలు, చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం నిలిచిపోయే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో సమ్మె విరమించాలని ప్రభుత్వం పేర్కొంది. లేకపోతే గైర్హాజరుగా భావించి, సంబంధిత జిఒల ప్రకారం కలెక్టర్లు చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వారి సంక్షేమానికి సంబంధించి కొన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంగన్‌వాడీ కార్యకర్తలకు తమ సర్వీసు చివరి నాటికి ఇప్పుడున్న బెనిఫిట్ రూ.50 వేలను లక్ష రూపాయలకు పెంచేందుకు అంగీకరించింది. అంగన్‌వాడీ హెల్పర్లకు సర్వీసు చివరి నాటికి బెనిఫిట్‌ను రూ.20 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ సహాయకులను కార్యకర్తలుగా ప్రమోషన్ కోసం గరిష్ట వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచేందుకు అంగీకరించింది. అంగన్‌వాడీ కార్యకర్తలకు టిఎ, డిఎలను రాష్ట్రప్రభుత్వ నిధుల నుంచి విడుదల చేస్తారు. రాష్ట్రంలో వయబిలిటీ ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది.

రూ.10 వేల కోట్లతో నిధి

- గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకలు పెంపకందారుల సహకార సంఘానికి రూ.10 వేలకోట్లతో నిధిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, సహాయ కార్యదర్శి టి తిరుపతిరావు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలో సంఘం రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన గంటా శ్రీరామ్ మాట్లాడుతూ.. ప్రతి పెంపకందారునికి 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షలు రుణం ఇవ్వాలని కోరారు. పాదయాత్ర సందర్భంగా వైఎస్ జగన్ ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తరువాత మరిచిపోయారన్నారు. ఎన్‌సిడిసి ఖాతాలో ఉన్న రూ.88 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలోకి మళ్లించడం దుర్మార్గ చర్య అన్నారు. వైఎస్‌ఆర్ పశునష్ట పరిహార బీమా పథకాన్ని పునరుద్ధరించి అన్ని జీవాలకు ప్రభుత్వమే ఉచితంగా బీమా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పశు నష్ట పరిహారం నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలు సంఖ్యకు అనుగుణంగా అన్ని రకాల నాణ్యమైన టీకాలు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. గొర్రెలు, మేకలకు రాత్రి బసలకు 90 శాతం సబ్సిడీతో ఉపాధి హామీ నిధులతో షెడ్లు నిర్మాంచాలన్నారు. 50 ఏళ్లు నిండిన పెంపకందారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

త్రిసభ్య ధర్మాసనమే విచారించాలి

- కార్యాలయాల తరలింపుపై హైకోర్టులో ప్రభుత్వ వాదన

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నంకు ప్రభుత్వ కార్యాలయాలు తరలిస్తున్నారంటూ దాఖలైన వ్యాజ్యాలను హైకోర్టు త్రిసభ్య ధర్మాసనమే విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం వాదించింది. సింగిల్ జడ్జి విచారించడానికి వీల్లేదని అన్నది. ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష కోసం విశాఖపట్నంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు నిమిత్తం అనువైన ప్రదేశాలను గుర్తిస్తూ ఐఎఎస్‌ల కమిటీ నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జిఓ 2283 జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. త్రిసభ్య ధర్మాసనం మాత్రమే విచారించాలని రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనశాఖ (జిఎడి) కార్యదర్శి పోలా భాస్కర్ రాతపూర్వకంగా హైకోర్టుకు నివేదించారు. 2020లో పలుసార్లు విచారణ జరిపిన త్రిసభ్య ధర్మాసనం, విచారణ సమయంలో కార్యాలయాల తరలింపు ప్రయత్నాలు ప్రభుత్వం చేపడితే తమ దృష్టికి తీసుకురావచ్చు అని గతంలో హైకోర్టు ఆదేశించిందని పిటిషనరు గుర్తు చేశారు. విచారణ సోమవారానికి వాయిదా పడింది.

హైకోర్టును ఆశ్రయించిన ఐపిఎస్ కృపానంద్

ప్రజాశక్తి-అమరావతి

మంగళగిరి టౌన్ పోలీసులు 2022 జులైలో నమోదు చేసిన ఓ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపిఎస్ అధికారి, అదనపు డైరెక్టర్ జనరల్ (రోడ్ సేఫ్టీ) కృపానంద్ త్రిపాఠి ఉజేలా హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్‌పై నమోదైన కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగఢ మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హోంగార్డు ఉద్యోగం పేరుతో తనను మోసం చేశారంటూ వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. నరేష్, అరవింద్ అనే ఇద్దరు వ్యక్తులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో తాను నిందితుడు కాదని, అయినా పోలీసులు తన ఇంటికి వస్తున్నారని, ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ కృపానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి పూర్తి వివరాల సమర్పణ నిమిత్తం విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

30న విజయవాడలో భారీ సదస్సు

- మేథోమదన సదస్సు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'మోడీ హఠావో - దేశ్ బచావో' అనే నినాదంతో ఈ నెల 30న విజయవాడలో భారీ సదస్సు నిర్వహించాలని మేథోమదన సదస్సు నిర్ణయించింది. మోడీని ఓడించి దేశాన్ని కాపాడాలనే నినాదంతో రాష్ట్ర హక్కుల సాధన కోసం, మతోన్మాద బిజెపితో అంటకాగుతున్న పార్టీలను ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా కలిసొచ్చే పార్టీలు, సంఘాలు, మేధావులు, కవులు, కళాకారులు, ప్రజాస్వామిక వాదులందరినీ ఒక వేదికపైకి తీసుకొచ్చేందుకు భారీ సదస్సు ఏర్పాటు చేయాలని సదస్సు తీర్మానించింది. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు, కెఎల్ విజయ్‌రావు (కెఎల్ రావు కుమారుడు) అధ్యక్షతన మేథోమదన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వడ్డే, కెఎల్ విజయ్‌రావు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం, మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ఫెడరల్, లౌకిక స్ఫూర్తికి మతోన్మాద బిజెపి నుంచి ప్రమాదం ఏర్పడిందన్నారు. రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లో పెట్టుకుని దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందన్నారు. దేశాన్ని ఫాసిజం వైపు తీసుకురావడానికి బిజెపి పూనుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని, దేశ సంపదను అదానీ, అంబానీలకు కేంద్రం కట్టబెడుతోందని, కార్మిక హక్కులను కాలరాస్తోందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. బిజెపి మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశంలోని ప్రజానీకానికే ప్రమాదం ఉందన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్యాకేజీ ఇవ్వకుండా కేంద్రం మోసం చేస్తోందన్నారు. లిస్ట్-2లో ఉన్న వ్యవసాయం, మైనర్ పోర్టులు, లిస్ట్-3లో ఉన్న విద్యుత్తు అంశాలపైన రాష్ట్రాలతో చర్చించకుండానే చట్టాలు చేస్తోందన్నారు.

పేదలపై పన్నుల భారం, కార్పొరేట్లకు లబ్ధిని చేకూర్చడం, ఆదివాసీల హక్కులను హరించడం, భూములను లాక్కొంటూ అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు చేయడం సరికాదన్నారు. సి2ప్లస్ 50 శాతం ఎంఎస్‌పి హామీని విస్మరించి రైతులకు ఒక్క రూపాయి కూడా రుణమాఫీ చేయకపోగా, కార్పొరేట్లకు రూ.14.60 లక్షల కోట్లు మాఫీ చేసి, విభజన చట్టంలోని హామీలను అమలు చేయలేదని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేందుకు యత్నిస్తున్నారన్నారు. కార్మికులు సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్లు తెచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగించిన మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సదస్సులో రిటైర్డు ఐఎఎస్ అధికారి బి శ్రీనివాస్, రమేష్ పట్నాయక్, సిపిఎం, సిపిఐ, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై వెంకటేశ్వరరావు, వై కేశవరావు, వి ఉమామహేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, చుండూరి రంగారావు, అక్కినేని వనజ, వి వెంకటేశ్వర్లు, పివి రమణారెడ్డి, మావూ సియాన్, డివి కుమార్, ఎం వెంకటరెడ్డి, బి హరనాథ్, నెల్లూరు నరసింహారావు, సి భాస్కర్‌రావు, పి జమలయ్య, టి లక్ష్మీనారాయణ, ఎన్ లక్ష్మణరావుతోపాటు 32 సంఘాల ప్రతినిధులు, మేధావులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలను కేబినెట్‌లో చర్చించండి

- ఎపి విఆర్‌ఎల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యలను రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఎ) సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెయిల్‌కు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి అంజి, కె ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు షేక్ మొగలాబి, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ మంగళవారం వినతిపత్రం పంపారు. ఈ నెల 15న జరిగే కేబినెట్ సమావేశంలో విఆర్‌ఎ సమస్యలను చర్చించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బిఎల్‌ఓ విధుల్లోంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన డిఎను 2018 జూన్ నుండి ఇవ్వాలన్నారు. తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే విఆర్‌ఓ పోస్టులను భర్తీ చేయాలని, విఆర్‌ఎలకు 30 శాతం ఉన్న పర్సంటేజీని 70 శాతం పెంచి విఆర్‌ఓ పోస్టు ప్రమోషన్ ఇవ్వాలని, సిపిటి ఎగ్జామ్ రద్దు చేయాలని కోరారు. నామినీ విఆర్‌ఎగా పనిచేసిన వారిని తక్షణమే వారి కుటుంబ ఒప్పందంతో రెగ్యులర్ విఆర్‌ఎగా నియమించాలన్నారు. విధులు నిర్వహిస్తూ మరణించిన విఆర్‌ఎలకు ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కొత్త ఆర్‌డిఓ ఆఫీసులో వాచ్‌మెన్, అటెండరు పోస్టులను విఆర్‌ఎలతో భర్తీ చేయాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-త్రిపురాంతకం (ప్రకాశం జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన త్రిపురాంతకం మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... విశ్వనాథపురం గ్రామానికి చెందిన కటికె రమణయ్య (54) ఈ ఏడాది ఒక ఎకరంలో మిరప, 1.50 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. సాగుకు పెట్టుబడుల కోసం అప్పులు చేశారు. దీనికి తోడు గత రెండేళ్ల నుంచి సాగు కలిసి రాక అప్పులే మిగిలాయి. ఇలా మొత్తం రూ.16 లక్షలు అప్పు తేలింది. ఈ ఏడాది సాగు చేసిన మిరప, వరి పైర్లు తుపాను కారణంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. రమణయ్య పొలం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో పంట నష్టం రాసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో రమణయ్య తన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిహారం వెంటనే చెల్లించండి : వి.శ్రీనివాసరావు

విలీన మండలాల్లో తుపానుకు దెబ్బతిన్న పంటల పరిశీలన

ఎటపాక మండలం మురుమూరులో దెబ్బతిన్న మిరప పంటను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, మంతెన సీతారాం, కిరణ్

ప్రజాశక్తి - ఎటపాక, వి.ఆర్.పురం, కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మిచౌంగ్ తుపాను రైతులకు తీవ్ర నష్టం చేకూర్చిందని, బాధితులకు తక్షణం పంట నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలోని ఎటపాక, వి.ఆర్.పురం, కూనవరం మండలాల్లో తుపానుకు దెబ్బతిన్న పంటలను పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మంతెన సీతారాం, ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ తదితరులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. రైతుల కష్టాలను తెలుసుకున్నారు. మురుమూరు గ్రామంలో గిరిజన రైతు కాకా చంద్రరావు తనకున్న రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేయగా తుపాను వల్ల తీవ్రంగా నష్టపోయానని, ఎకరానికి రూ.80 వేల చొప్పున ఖర్చయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు రైతులు తాము ఎంతగా నష్టపోయిందీ వివరించారు. అనంతరం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులు అధికంగా మిర్చి సాగు చేశారని, వైరస్ బారిన పడిన మిర్చి తోటలను చాలా మంది రైతులు పీకేశారని, మరలా సాగు మొదలెట్టి ఎకరానికి లక్ష రూపాయలకుపైగా ఖర్చు పెట్టారని తెలిపారు. ఇటీవల వచ్చిన తుపాను మిర్చి పంటను తీవ్రంగా దెబ్బతీసిందని, రైతులకు లక్షల్లో నష్టం వాటిల్లిందని తెలిపారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని, నష్టం తీవ్రత ఎక్కువగా ఉంటే లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలీన మండలాల్లో ప్రతి ఏడాది అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, ఈసారి వరి, మిర్చి, పొగాకు, మినుము, మొక్కజొన్న పంటలు నీట మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల్లో ఎక్కువ మంది అప్పు చేసి వ్యవసాయం చేశారని, తుపాను వల్ల వారంతా అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదముందని తెలిపారు. విలీన మండలాలపై చిన్న చూపు తగదన్నారు. ఇక్కడి ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. పంటల పరిశీలనలో పార్టీ జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మర్లపాటి నాగేశ్వరరావు, పూనం సత్యనారాయణ, వి.ఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, రైతు సంఘం నాయకులు పులుసు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎటపాక మండలం నెల్లిపాకలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగగా వారికి వి.శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు.

ఆహ్వానకమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి

ఐద్వా జాతీయ సమావేశాల జయప్రదానికి పిలుపు

- సంఘాన్ని విస్తరింపజేయాలన్న పుణ్యవతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఫిబ్రవరి 23 నుంచి 25వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే ఐద్వా జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని సంఘం జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి పిలుపునిచ్చారు. ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన దాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆహ్వాన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పుణ్యవతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పది వేల ప్రభుత్వ స్కూళ్లు మూసివేశారని, తద్వారా లక్షల మంది పిల్లలు విద్యకు దూరమైందన్నారు. 67 శాతం మంది పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉందని తెలిపారు. విశాఖలో పబ్లిక్ రంగాన్ని కాపాడుకునేందుకు మహిళా సంఘం ప్రత్యక్షంగా కృషి చేసిందన్నారు. షిప్‌యార్డు, బిహెచ్‌పివిలను కార్పొరేట్లకు అప్పగించనీయకుండా ప్రత్యక్షంగా ప్రభుత్వ వాహనాలకు అడ్డుపడి ఆపారని తెలిపారు. ఇటువంటి పోరాటాల్లో మహిళా సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని ప్రభుత్వ రంగాన్ని కాపాడారని గుర్తు చేశారు. ఇప్పుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే పోరాటంలో కూడా మహిళా సంఘం ముందున్నదన్నారు. ఇండస్ట్రియల్, ఆటోనగర్, క్వారీ కార్మికుల పోరాటాల్లో కూడా మహిళా సంఘం ఎనలేని కృషి చేసిందన్నారు. మన శక్తి యుక్తులను పూర్తిగా ఉపయోగించి ఐద్వా జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని, మన సంఘాన్ని విస్తరించాలని పిలుపునిచ్చారు. విశాఖ భవితవ్యం కాపాడటానికి ఈ సమావేశాలు వేదిక కావాలని, దాని కోసం అందరూ ఆర్థిక, హార్థిక ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, రమాదేవి, సహాయ కార్యదర్శి ప్రియాంక, జిల్లా అధ్యక్షులు బి.పద్మ, ప్రొఫెసర్ నిర్మల, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ఐలు నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని మంగళవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన కుటుంబ సమేతంగా శ్రీవారిలో సేవలో పాల్గొన్నారు. అనంతరం గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పుతో కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. 28న నిర్వహించే అఖిల భారతీయ కాంగ్రెస్ సమావేశంలో పలు సంక్షేమ పథకాలు ప్రారంభిస్తామని తెలిపారు.

భూ యజమాన్య హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదుల ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

ప్రభుత్వం తెచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన ర్యాలీ చేశారు. కోర్టు ప్రాంగణం నుండి శివాజీచౌక్, గాంధీచౌక్, బోసురోడ్డు మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ భూమికి సంబంధించిన వివాదాలు ఇప్పటి వరకూ సివిల్ కోర్టుల్లో పరిష్కరించుకునేవారని తెలిపారు. సివిల్ కోర్టుల్లో పరిష్కారం దక్కకుంటే హైకోర్టు, అక్కడా న్యాయం జరగకుంటే సుప్రీం కోర్టు వరకూ వెళ్లి హక్కులను కాపాడుకునేవారని తెలిపారు. తాజాగా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం 27/23 ద్వారా ప్రజల హక్కులు కాలరాస్తున్నారని, రాజ్యాంగానికి విరుద్ధంగా తెచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం దొడ్డిదారిన తెచ్చిన చట్టంతో భూమికి సంబంధించిన వివాదాలు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ట్రిబ్యునల్‌కు బదలాయించారన్నారు. ట్రిబ్యునల్‌లో తీర్పు అధికారి విచక్షణాధికారం మీదే ఆధారపడి ఉంటుందని తెలిపారు. చట్టంతో సంబంధంలేని తీర్పులుంటాయని, రాజకీయ ఒత్తిళ్లు కూడా ఉంటాయని, అంతే కాదు మాంగా హక్కుదారులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, న్యాయవాదులు గుంటి సురేష్‌బాబు, పి.శ్రీనివాసరావు, ఇందుపల్లి రాజారామ్, జి.జయరామకృష్ణ, ఎల్.జగదీశ్వరాంబ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

13న సిటిఆర్ఐ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు

- సిటిఆర్ఐ డైరెక్టర్ శేషు మాధవ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సిటిఆర్ఐ) ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 13న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సిటిఆర్ఐ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలకు ఐసిఎఆర్ సెక్రటరీ డాక్టర్ హిమాన్షు పాఠక్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపి మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జక్కంపూడి రాజా, ఐసిఎఆర్ ఎడిజి డాక్టర్ డికె.యాదవ, ఎఎన్‌జిఆర్‌ఎయు వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె.పద్మరాజు, టుబాకో బోర్డు చైర్మన్ సిహెచ్.యస్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శ్రీధర్ గౌరవ అతిథులుగా పాల్గొంటారని వివరించారు. 14న అంతర్జాతీయ సదస్సుకు ఐసిఎఆర్ ఐహెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కె సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కొత్త పొగాకు వంగడాలను రూపొందించడం, దిగుబడి పెంచడం, చీడపీడలను నివారించడం, నాణ్యతగల పొగాకు ఉత్పత్తి సాధించడం, ఎగుమతుల ద్వారా దాదాపు రూ.20 వేల కోట్ల ఆదాయం తేవడం వంటి ఎన్నో కార్యక్రమాలతో సిటిఆర్ఐ అభివృద్ధిలో దూసుకెళ్తోందని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

అర్హులందరికీ పథకాలందించడమే లక్ష్యం

- వికసిత్ భారత్ సంకల్పయాత్రలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - దెందులూరు/ఏలూరు టౌన్ (ఏలూరు జిల్లా)

భారత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులందరికి అందజేయడంతోపాటు ఆయా పథకాల అమల్లో సంతృప్తి స్థాయిని సాధించడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని రాష్ట్ర గవర్నర్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం మంగళవారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయగూడెంలోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ ప్రభు త్వం పౌరుల అవసరాలను గుర్తించాలని, వారికి వారి హక్కులను ఇవ్వాలని, ఇది సహజ న్యాయమని, సామాజిక న్యాయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హత ఉన్న ఆఖరి లబ్ధిదారుడికీ అందించాలన్నదే సంకల్పయాత్ర లక్ష్యమని తెలిపారు. వివిధ పథకాల కింద అర్హులైన ఇప్పటివరకూ ప్రయోజనాలు పొందని బలహీన వర్గాలను చేరుకోవడానికి, సమాచారవ్యాప్తి, పథకాల గురించి ఈ యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. లబ్దిదారుల తో వారి వ్యక్తిగత అభిప్రాయాలు, అనుభవాలు భాగస్వామ్యం ద్వారా ఇతరులకు అవగాహన కల్పించేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని అవుట్ రిచ్ కార్యక్రమాలను వివరించారు. తొలుత కేంద్ర సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర డిజిటల్ ప్రచార వాహనానికి గవర్నర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ పథకాల స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన మంత్రి మోడీ రికార్డెడ్ వీడియో సందేశాన్ని ఎల్ఇడి స్క్రీన్ ద్వారా అందరూ వీక్షించారు.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబయి-400 013 మరియు రిటైల్ పోర్ట్‌ఫోలియో మేనేజిమెంట్‌గా దీని ఒక ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, ఐ-థింక్ టెక్నో క్యాంపస్, కంజుర్‌మార్గ్ (ఈస్ట్), ముంబయి-400042.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టబడిన సెక్యూరిటీస్ అమ్మకం కొరకు అమ్మకపు సమాచారం మరియు బహిరంగ ప్రకటన.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ (ది "బ్యాంక్") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు సెక్యూరిటీస్ పై లోన్/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో రుణసదుపాయాలు పొందుట కొరకు బ్యాంకుకు తాకట్టుపెట్టబడిన సెక్యూరిటీస్ అమ్మకంకు సంబంధించి ఇందుమూలంగా గమనించండి.

డెలిన్క్వెంట్ స్టేటస్‌లో దిగువ రుణ ఖాతాలు, లోన్ నియమాలు అంగీకారం ప్రకటన బకాయిలను తిరిగిచెల్లించుటలో రుణగ్రహీతలచేత పెర్సిస్టెంట్ డిఫాల్టి దృష్ట్యా, ఏదైతే దిగువ పేర్కొన్న తేదీన ఫైనల్ సేల్ నోటీసుతో సహా, ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులును బ్యాంక్ జారీచేసింది, బ్యాంక్ తాకట్టును ఇన్‌వోక్డ్ కలిగి మరియు దిగువ ఖాతాల్లో పూర్తి బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటకు రుణగ్రహీతలకు 7 రోజుల సమయం ఇచ్చింది, విఫలం చెందినచో, ఏదైతే, ఈ విషయంలో ఏదేని తదుపరి నోటీసు ఇవ్వకుండానే తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్‌ను బ్యాంకు అమ్మకానికి పోతుంది.

రుణగ్రహీతలు బకాయిలను తిరిగి చెల్లించుటలో అశ్రద్ధ చేసి మరియు విఫలం చెందారు, అందుకుగాను, రుణగ్రహీతలచే బ్యాంకుకు బకాయిల రికవరీ కొరకు **20 డిసెంబర్ 2023** న లేదా తరువాతగాని తాకట్టుగా రుణ అగ్రిమెంట్ క్రింది హక్కులను బ్యాంకు వినియోగించి, సెక్యూరిటీస్ అమ్మకం/డిస్పోజ్‌ఆఫ్ చేయుటకు అధికారాలు కలిగియుంటుంది. రుణగ్రహీతలు ఇది కూడా గమనించాల్సిన అవసరం ఉంది, ఏమనగా. ఏ సమయమునైనా, ఈ విషయంలో ఏవేని తదుపరి నోటీసు ఇవ్వకుండానే ఒక (1) క్యాలెండర్ దినంలోగా తాకట్టుపెట్టిన సెక్యూరిటీ డిసెర్టన్ అమ్మకంతో అప్పుడు బ్యాంకు మార్జిన్ అవసరాలలో తదుపరి డిఫిసెన్సీ నెలకొల్పుటకు స్టాక్ మార్కెట్‌లో వోలటిలిటీకు తదుపరి బాకీకి తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్ విలువలోకి పడిపోయిన, తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్ అమ్మకం నుండి సర్దుబాటుచేసిన తరువాత ఏవేని మిగతా బకాయి మొత్తాలును తిరిగి చెల్లించుట కొరకు బ్యాంకు రుణగ్రహీతల నుండి మిగతా బకాయిలను రాబట్టుటకు చట్టపరమైన చర్యలు తీసుకొంటుందని కూడా దయచేసి గమనించగలరు.

క్ర. సం	రుణ ఖాతా నంబరు	రుణగ్రహీతల పేరు	10 డిసెంబర్ 2023 నాటికి బకాయి మొత్తాలు	అమ్మకపు ప్రకటన తేది
1	XXXX1156	రాధాకృష్ణ మూర్తి దివాలా	58,259.31	11-Dec-23

తేది: 13.12.2023
ప్రదేశం: ఆం.ప్ర.

సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

రైతులను మోసగిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి : ఆహ్వాన సంఘం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతులను మోసగిస్తోందని, గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి విమర్శించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో కర్నూలులో జరిగే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా 15న నిర్వహించే రైతు ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కర్నూలులోని కార్మిక, కర్షక భవన్‌లో వారు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంఎ గఫూర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎలా తిప్పి కొట్టాలనే అంశాల పై ఈ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తిప్పి కొట్టడం దేశ చరిత్రలో ఒక కీలక ఉద్యమమని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఎఐకెఎస్ నాయకులు ఈ సమావేశాలకు హాజరు కానున్నారని తెలిపారు. కార్మిక, కర్షక ఐక్యత ఆచరణ ఢిల్లీ ఉద్యమం ద్వారా బలంగా నిర్మించబడుతోందన్నారు. రైతులకు, కార్మికులకు ఈ సమావేశాల ద్వారా ఒక సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి 140 మంది రైతు ప్రతినిధులు హాజరవు తారని తెలిపారు. వ్యవసాయంపై శ్రద్ధలేని ప్రభుత్వ ం రాష్ట్రంలో ఉందని విమర్శించారు. కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15న జరిగే బహిరంగ సభలో ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ దావలే, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా పాల్గొంటారని తెలిపారు. ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో సోమవారం నుండి ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయని చెప్పారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పిజి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్ ఆర్జా రామకృష్ణ మాట్లాడుతూ రైతుత పరిస్థితి దేశంలో అందరి కన్నా దీనంగా ఉందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆటో ప్రచార జాత ప్రారంభం

ఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల జయప్రదానికి ఆటో ప్రచార జాతాను సుందరయ్య భవన్ వద్ద ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్, ఆటో యూనియన్ న్యూ సిటీ అధ్యక్షులు హుస్సేన్ వలి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ పాల్గొన్నారు.

మళ్లీ ఎగిసిన ధరలు

- 5.55 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : దేశంలో ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో వినియోగదారుల రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 5.55 శాతానికి ఎగిసిందని మంగళవారం కేంద్ర గణంకాల శాఖ కార్యాలయం ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఇంతక్రితం అక్టోబర్‌లో సిపిఐ 4.87 శాతంగా నమోదయ్యింది. గడిచిన నవంబర్‌లో గ్రామీణ ద్రవ్యోల్బణం 5.85 శాతానికి పెరిగింది. ఇది అక్టోబర్‌లో 5.12 శాతంగా ఉంది. ఇదే సమయంలో అహార ద్రవ్యోల్బణం 6.61 శాతంగా ఉండగా.. గడిచిన నెలలో ఏకంగా 8.70 శాతానికి ఎగిసింది. రిటైల్ ద్రవ్యోల్బణం సూచీని 2-6 శాతం మధ్యన కొనసాగేలా ఆర్‌బిఐ లక్ష్యంగా పెట్టుకుంది. మధ్యస్థ కాలానికి 4 శాతానికి కట్టడి చేయాలని నిర్దేశించుకుంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో అంచనా వేసింది.

పెరిగిన పారిశ్రామికోత్పత్తి

ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) 11.7 శాతానికి పెరిగి.. 16 మాసాల గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ముఖ్యంగా తయారీ రంగం, గనులు, విద్యుత్ రంగాలు మెరుగైన వృద్ధిని కనబర్చాయని కేంద్ర గణంకాల శాఖ పేర్కొంది. ఇంతక్రితం మాసం ఆగస్ట్‌లో ఐఐపి 10.3 శాతంగా చోటు చేసుకుంది. అక్టోబర్‌లో తయారీ రంగం 10.4 శాతం, గనుల రంగం 13.1 శాతం, విద్యుత్ 20.4 శాతం చొప్పున పెరుగుదలను నమోదు చేశాయి.

అంచనా కంటే ద్రవ్యలోటు తక్కువే.. : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : స్థూల జిడిపిలో రాష్ట్రాల విత్త లోటు తక్కువగానే ఉందని ఆర్‌బిఐ తెలిపింది. ఆర్థికంగా రాష్ట్రాలు బలపడుతున్నాయని ఆర్‌బిఐ పేర్కొంది. 2021-22, 2022-23లో జిడిపిలో విత్త లోటు 2.8 శాతంగా చోటు చేసుకుందని పేర్కొంది. రాష్ట్రాలు తమ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధిని కొనసాగిస్తున్నాయని తెలిపింది. వరుసగా రెండో ఏడాది బడ్జెట్ అంచనాల కంటే తక్కువగా ఉందని తెలిపింది. 'స్టేట్ ఫైనాన్స్: ఎ స్టడీ ఆఫ్ బడ్జెట్స్ ఆఫ్ 2023-24' అనే శీర్షికతో రూపొందించిన నివేదిక ప్రకారం.. బలమైన మూలధన వ్యయాలను కొనసాగించడం ద్వారా ప్రధానంగా రెవెన్యూ లోటును తగ్గించడం ద్వారా లోటు తగ్గింపును సాధించగలిగామని ఆర్‌బిఐ పేర్కొంది. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) అమలు వల్ల రాష్ట్రాలకు పన్నుల భారం పెరిగిందని పేర్కొంది. ద్వితీయార్థంలో పన్ను రాబడి మెరుగుపడుతుందన్న అంచనాలతో రాష్ట్రాల ఆర్థిక దక్పథం అనుకూలంగానే ఉందని తెలిపింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో, లాక్‌డౌన్ చర్యల సడలింపు, ఆ తర్వాత వచ్చిన మార్పుల కారణంగా రాష్ట్రాల ఆదాయ వసూళ్లలో గణనీయమైన పెరుగుదల ఉందని ఆర్‌బిఐ పేర్కొంది.

టాటా ఎఐజి నుంచి 'హెల్త్ సూపర్ ఛార్జ్' పాలసీ

ముంబయి : సాధారణ బీమా ప్రొవైడర్లలో ఒకటైన టాటా ఎఐజి జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కొత్తగా 5 రెట్ల బీమా రక్షణతో హెల్త్ సూపర్ చార్జ్ పాలసీని ఆవిష్కరించినట్లు ప్రకటించింది. దీన్ని అన్ని ప్రాంతాల వర్గాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లు పేర్కొంది. టాటా ఎఐజి దేశవ్యాప్తంగా 10వేల హాస్పిటల్స్ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నట్లు తెలిపింది. "జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ పాలసీ మా వినియోగదారులకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడంలో మా అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది." అని ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సంతోష్ పూరి పేర్కొన్నారు.

కాగ్నిజెంట్ ఆస్తుల అమ్మకాలు..!

హైదరాబాద్ : దిగ్గజ టెక్ కంపెనీల్లో ఒకటైన కాగ్నిజెంట్ పొదుపు చర్యల్లో భాగంగా ఆస్తులను విక్రయించాలని భావిస్తోందని సమాచారం. హైదరాబాద్, చెన్నైలోని తన ఆస్తులను అమ్మడానికి సిద్ధంగా ఉందని రిపోర్ట్‌లు వస్తున్నాయి. వచ్చే రెండేళ్లలో రూ.3,300 కోట్లను ఆదా చేసే లక్ష్యంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. హైదరాబాద్ గచ్చిబౌలిలోని 10 ఎకరాల క్యాంపస్‌ను, చెన్నయ్ సిరుసేరిలోని 14 ఎకరాల క్యాంపస్‌ను విక్రయించాలని కాగ్నిజెంట్ యోచిస్తున్నట్లు సమాచారం.

పంజరంలో చిలుకలా న్యాయవ్యవస్థ : నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

పంజరంలో చిలుకలా న్యాయవ్యవస్థ మారిందని, ఆర్టికల్ 370పైన వచ్చిన తీర్పు దురదృష్టకరమని సిపిఐ జాతీయ నాయకులు కె.నారాయణ విమర్శించారు. భారతదేశాన్ని ముక్కలు చేసే రీతిలో బిజెపి పాలన ఉందన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి నియంతృత్వ ధోరణితో పరిపాలన సాగించిన జగన్‌మోహన్‌రెడ్డికి ఈసారి ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చినంత మాత్రాన జగన్‌కు ఒరిగేదేమీలేదని అభిప్రాయపడ్డారు. తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేల చొప్పున తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు.

మనబడి 'నాడు-నేడు'లో రూ.2,253 కోట్లు స్కామ్

- నాదెండ్ల మనోహర్ ఆరోపణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యారంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతోపాటు ఇతర సంస్థలు కేటాయించిన రూ.6 వేలకోట్లలో రూ.2,253 కోట్లు దారి మళ్లించి అవినీతికి వైసిపి ప్రభుత్వం పాల్పడిందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దారి మళ్లిన నిధులపై ముఖ్యమంత్రి సమగ్ర విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్

హామీల అమలుపై ప్రశ్నించండి

- మద్యనిషేధంపై వైసిపి నేతలను నిలదీయండి
- యువగళం పాదయాత్రలో మహిళలతో లోకేష్ ముఖాముఖి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

ఎన్నికల్లో ఇచ్చిన మూడు హామీలను అమలు చేయని వైసిపి నేతలను మహిళలు నిలదీయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చిన్నదొడ్డిగల్లు వద్ద భోజన విరామ సమయంలో మహాశక్తి కార్యక్రమం పేరిట పాయకరావుపేట నియోజకవర్గ మహిళలతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపూర్ణ మద్య నిషేధం, ఇంట్లో పిల్లలందరికీ అమ్మఒడి, 45 ఏళ్లు నిండిన మహిళలకు పింఛన్ ఎందుకు అమలు చేయలేదో వైసిపి నేతలను మహిళలు ప్రశ్నించాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున అందిస్తామని, ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 50 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1500, దీపం పథకం కింద ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ కనెక్షన్లు మహిళలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తోన్న పన్నులను తగ్గిస్తామని, చంద్రన్న బీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వన్ టైమ్ సెటిల్ మెంట్ కింద చెల్లించి, తర్వాత ప్రతి ఏటా డబ్బులు నేరుగా కాలేజీలకు జమ చేస్తామని చెప్పారు. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. మహిళల స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ ఇప్పించి వారితో స్కూల్ యూనిఫాం కుట్టించే విషయం ఆలోచిస్తున్నామని తెలిపారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, తెలుగు మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత, వి.మాడుగుల మాజీ ఎమ్మెల్యే డి.రామానాయుడు, జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నమోదిత కార్యాలయం: 601 & 602, పెనిన్సుల బిజినెస్ పార్క్, 6వ అంతస్తు, టవర్ ఎ, సేనాపతి బాపత్ మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400 013

DCB BANK

బహిరంగ ప్రకటన

అభరణాల వేలం కమ్ నోటీసు అహ్వానించుట

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు డిసిబి బ్యాంక్ లిమిటెడ్ నుండి అభరణాలు ఎదురుగా వారిచే పొందిన రుణసౌకర్యాలు మొత్తం బకాయిలు చెల్లించుటకు నోటీసులు జారీచేయబడినాయి. మొత్తం బకాయిలు చెల్లించుటలో వారు విఫలమైన కారణంగా తాకట్టుపెట్టిన అభరణాల వేలం నిర్బంధంగా మేము నిర్వహిస్తున్నాము. డిసిబి బ్యాంక్ లిమిటెడ్ ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతా(లు) తొలగించుట/వేలం తేది(లు) మార్చే అధికారం కలదు. **21.12..2023** మరియు **22.12.2023**న **మ.12:00** గం.ల నుండి **మ.03:00** గం.ల వరకు వేలం **https://gold.Samil.in** ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించబడును.

క్ర. సం	ఖాతాదారుని ఐడి	ఖాతాదారుని పేరు	ప్రాంతం/ప్రదేశం
1	105037958	కాకుమాను కృష్ణ	గుంటూరు
2	105675910	ముళ్లపుడి శివనాగ కుమారి	గుంటూరు
3	102428670	నడింపల్లి శివరామ కృష్ణ	గుంటూరు
4	101591124	పెరుమాళ్ల పావని సూర్య కుమారి	కాకనాడ
5	104242471	ముచ్చు అరుణ	పాయకారావుపేట
6	104141708	వెలగ అమ్మాజి	పాయకారావుపేట
7	104163030	యలమంచిలి లోవమ్మ	పాయకారావుపేట
8	104236565	దాసరి శివ	రాజమండ్రి
9	102858287	షేక్ మహమ్మద్ గౌస్ ఎమ్ఓహెచ్	రాజమండ్రి
10	102881727	సురేష్ కుమార్ ఏనుగుధాటి	రాజమండ్రి
11	103013016	కర్నాటి వెంకట రమణ	విజయవాడ
12	102905550	షేక్ రాఫా	విజయవాడ
13	101985110	షేక్ రజీన	విజయవాడ
14	105623416	ఆరిశెట్టి శ్రావణ గౌరీ	విశాఖపట్నం
15	105177858	చింతపల్లి కేసరి	విశాఖపట్నం
16	105503261	గుల్లిపల్లి నరసింహ మూర్తి	విశాఖపట్నం
17	104527774	ఇంటి ఆషా కిరణ్	విశాఖపట్నం
18	105075646	కనకాల మీన	విశాఖపట్నం
19	102784957	ముంచెంగ్లె సుందర్ నాయర్	విశాఖపట్నం
20	105625616	తంపర సీతారామ్	విశాఖపట్నం
21	105268519	తిప్పన వెంకటరావు	విశాఖపట్నం

షెడ్యూల్ వేలం తేది ముందు వరకు ఉన్న వడ్డీ మరియు చార్జీలుతో పూర్తి బకాయిలు చెల్లించే సౌలభ్యం సంబంధిత రుణగ్రహీతలు/తాకట్టుపెట్టిన వారికి చివరిగా ఒక అవకాశం ఇవ్వడమైనది విఫలమైతే ఈ అభరణాలు వేలం వేయడం జరుగుతుంది. ఒకవేళ వేలం సూచించిన వేలం తేదిలలో పూర్తికాలేకపోయినట్లయితే తదుపరి నోటీసు లేకుండా వేలం ఏదైనా ఇతర రోజులలో కొనసాగించబడును. బిడ్ల వేలం మరియు అంగీకారంలో పాల్గొనడం డిసిబి బ్యాంక్ యొక్క స్వంత అభీష్టానుసారం ఉంటుంది. దయచేసి గమనించవలసింది ఏమనగా వేలం **"ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్దతి ఆధారం", "ఏది ఏమైనా ఆ పద్దతిగా"** మరియు **"ఎలాంటి మద్దతు లేకుండా"** జరుగును, అభరణాలకు సంబంధించి ఎలాంటి దావాలకు బాధ్యత వహించదు. వేలంలో పాల్గొనుటకు బిడ్డర్‌లు వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కొరకు **https://gold.Samil.in** చూడండి.

తేది: 13.12.2023

సం/- అధీకృత అధికారి
డిసిబి బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

సమాఖ్య స్ఫూర్తికి విఘాతం

జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిపై సుప్రీం తీర్పు కేంద్రప్రభుత్వ ఏకపక్ష, అప్రజాస్వామిక వైఖరికి సమర్థన. సమాఖ్య వ్యవస్థకు, ప్రజాస్వామ్య నిబంధనలకు, చట్టపరమైన ప్రక్రియలకు తీరని విఘాతం. న్యాయవ్యవస్థ గౌరవాన్నిసైతం తగ్గించేదిగా ఉంది. కేంద్రం తలచుకుంటే ఏమైనా చేయొచ్చనే ఏకపక్ష దురహంకార వైఖరికి వత్తాసు పలికినట్టుగా అనిపిస్తుంది.

జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దుపై ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం మోడీ ప్రభుత్వ చర్యను రాజ్యాంగపరంగా లేదా చట్టబద్ధంగా సమర్థించలేకపోయింది. ప్రత్యేక హోదా ఉపసంహరణ ప్రభుత్వ విధాన నిర్ణయమని, అందులో జోక్యం చేసుకోకూడదని కోర్టు చిత్రమైన వాదనను ముందుకు తెచ్చింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 కింద అనుమతించదగినదా? కాదా? అనేది తాము తేల్చదలచుకోలేదనడం మరో విడ్డూరం. 2019 ఆగస్టు 5 నాటికి రాష్ట్రపతి పాలనలో ఉంది. ఎన్నికైన శాసన సభ లేకపోగా, గవర్నర్ సమ్మతినే రాష్ట్ర సమ్మతిగా పరిగణించారు. దీనిని సమర్థించడం ద్వారా రాష్ట్రపతి పాలన విధించబడే, దాని సరిహద్దులు మార్చబడే, రాష్ట్రహోదా రద్దు చేయబడే ఇతర రాష్ట్రాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఒక రాష్ట్రానికి సంబంధించి ఎటువంటి తీవ్రమైన నిర్ణయమైనా, చట్టమైనా, శాసనమైనా చేసే హక్కు పార్లమెంట్‌కు ఉందన్న కోర్టు తీర్పు అనేక కొత్త సమస్యలకు దారితీస్తుంది. పైగా ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం దేశంలో ఇదే తొలిసారి.

ఆర్టికల్ 370 తాత్కాలికమేనని, భారత యూనియన్‌లో చేరిన తర్వాత జమ్మూ కాశ్మీర్‌కు సార్వభౌమాధికారం లేకుండా పోయిందని న్యాయస్థానం కేంద్రం చేసిన అన్ని రాజ్యాంగ విరుద్ధ చర్యలను సమర్థించింది. భారత యూనియన్‌లో జమ్ముకాశ్మీర్ విలీనం ఇప్పుడు రద్దు చేసిన 370వ అధికరణలో హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా నిలుపుకునే షరతుమీదే జరిగాయన్న అంశాన్ని సుప్రీం విస్మరించింది. దేశంలో అన్ని రాష్ట్రాల మాదిరిగానే జమ్ముకాశ్మీర్ కూడానని పేర్కొనడం ద్వారా 371వ అధికరణలోని వివిధ క్లాజుల కింద ఈశాన్య రాష్ట్రాలకు, మరికొన్ని రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేక హక్కులు కూడా కోల్పోయేలా తాజా తీర్పు ఉంది. దీని ప్రకారం జమ్ముకాశ్మీర్‌లోని కొంత భాగానికే రాష్ట్రహోదా పునరుద్ధరిస్తారు. లడక్ కేంద్రపాలిత ప్రాంతంగానే కొనసాగుతుంది. ఆర్టికల్ 370 తాత్కాలికమా లేదా దాన్ని సవరిస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వు రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటవుతుందా అనే ఎనిమిది ప్రశ్నలపై న్యాయస్థానం చేసిన సూత్రీకరణలు గతంలో ఫెడరలిజంపై తానిచ్చిన తీర్పులకు విరుద్ధంగా ఉన్నాయి. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం చట్టవిరుద్ధమైన, మోసపూరితమైన మార్గాన్ని అవలంబించింది. దాన్ని రద్దు చేయాలన్న దుర్బుద్ధితోనే మొదటి జమ్ముకాశ్మీర్ అసెంబ్లీని రద్దు చేసి రాష్ట్రపతి పాలన కిందకు తెచ్చుకుంది. రాజ్యాంగ నిర్మాణ సంస్థను శాసన సభగా మార్చుతూ రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులే కాశ్మీర్ ప్రత్యేక హోదా రద్దుకు కారణం.

రాజ్యాంగంలోని మూడో అధికరణాన్ని తొలిసారిగా ఒక రాష్ట్రాన్ని తగ్గించేందుకు నేరుగా ఉపయోగిస్తే దానిలో జోక్యం చేసుకోలేమని సర్వోన్నత న్యాయస్థానం చెప్పడం సబబు కాదు. కేంద్రం అపరిమిత అధికారాలతో రాష్ట్రపతి పేరిట చేసిన వాటిని ఆమోదించడమే కాకుండా ఎన్నికలు 2024 సెప్టెంబర్‌లోగా జరపాలని ఆదేశించడం సుదీర్ఘ సమయం ఇవ్వడమే. ఈ తీర్పుతో సంబరపడుతున్న బిజెపి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి ఉపయోగించుకోవడానికి వెసులుబాటు కల్పించడమే. 370 రద్దు చేసిన అనంతర పరిస్థితులు, పునరేకీకరణ కమిషన్ లాంటిది వేయాలని సర్వోన్నత న్యాయస్థానం చెబుతూ అది కూడా కేంద్రానికే వదిలేసింది. ఈ తీర్పును జమ్ముకాశ్మీర్‌కు చెందిన పార్టీలతోపాటు దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. సమాఖ్య విధానం, రాష్ట్రాల ప్రతిపత్తి, విలీన సమయంలో కాశ్మీర్‌కు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం దేశసమైక్యతకు, సమగ్రతకు అవసరం. ఇప్పటికే రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్రం మరింత ఏకపక్షంగా వ్యవహరించే ప్రమాదం పొంచి వుంది.

మహనీయుని మాట



వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్లు, నిరంతరం నేర్చుకునేవారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.
- రవీంద్రనాథ్ టాగూర్, విశ్వ కవి.

విద్యాలయాల్లో కుల వివక్ష వికృత రూపాలు

విశ్లేషణ

గత ఐదేళ్ళలో దేశంలోని వివిధ ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాల్లో దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన 13,600 మంది విద్యార్థులు అర్ధాంతరంగా చదువులు మానేశారని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి లిఖిత పూర్వకంగా పార్లమెంట్‌కు తెలిపారు. 2019-2021 మధ్య 35,000 మంది ఎస్.సి, ఎస్.టి విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని మరో కేంద్ర మంత్రి ప్రకటించారు. ఇంత పెద్ద సంఖ్యలో అట్టడుగు సామాజిక తరగతుల పిల్లలు చదువులు మానేయడం, ఆత్మహత్యల బారిన పడడం దేశ పాలకులను, కొందరు స్వయం ప్రకటిత మేధావులను ఏ మాత్రం చలింపచేయడంలేదు. కేంద్ర ప్రభుత్వ బిజెపి నాయకులు రానున్న 2024 ఎన్నికల్లో విజయం కోసం వేయాల్సిన ఎత్తులు, ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు అనుసరించాల్సిన జిత్తుల వ్యూహాల్లో మునిగిపోతున్నారు. మోడీ సంకీర్తనలో తీరికలేని కొందరు మేధావులు, అనుంగ మీడియా ఆయన 'ధీరోదాత్త' విజయాలను చరిత్రీకరించడం, కీర్తించడంతోనే సరిపోతున్నది. ఎవరైనా ప్రశ్నిస్తే రెడీమేడ్ సమాధానాలు వుండనే వున్నాయి. 'చదువుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు కారణాల'ని చిలక పలుకులు పలుకుతారు. భవిష్యత్‌పై ఎంతో ఆశతో కష్టపడి చేరుకున్న ఐఐటి, ఐఐఎం, కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుండి సర్టిఫికెట్లు లేకుండానే వెనక్కు రావడం, నిర్జీవులుగా మారడం దేశానికి ఎంతో నష్టం. కేవలం తాము పుట్టిన కులం వల్లనే ఈ దుస్థితి రావడం నేడు భారతదేశ విద్యారంగం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన ఆధునిక సామాజిక వివక్షకు నిదర్శనం. కేవలం విద్యాలయాల్లోనే కాదు. ఉద్యోగాలు, నివాసాలు, వ్యాపారాలు అక్కడ ఇక్కడేమిటి? అన్ని చోట్లా సాంఘిక వివక్ష కొత్తరూపాల్లో అనేక వెర్రితలలు వేస్తున్నది. లక్షలాది మందికి విజ్ఞానాన్ని, వేలాది మందికి జీవించే హక్కును హరించి వేస్తున్నది. ప్రపంచీకరణ, అది సృష్టించిన వ్యాపార సంస్కృతి, విదేశీ ఉద్యోగాలు, ఇంగ్లీషు విద్య లాంటివి దేశంలోని సామాజిక సమస్యలన్నిటికీ పరిష్కారమని భావించే కొందరు బుద్ధిజీవుల ఆలోచన ఎంత అల్పమైందో ఈ సంఘటనలు రుజువు చేస్తున్నాయి. కుల దురహంకార హత్యలనేవి భూస్వామ్య అవశేషాల జబ్బు మాత్రమే కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే డబ్బులో కూడా ఈ జబ్బు ఉంటుందని, అది ప్రాంతాలకు పరిమితమైంది కాదని దాని మూలాలు మన వెయ్యి పడగల కుల విష నాగులో ఉన్నాయని పదేపదే నిర్ధారణ అవుతున్నది.

వి. రాంభూపాల్

ఇంత పెద్ద సంఖ్యలో అట్టడుగు సామాజిక తరగతుల పిల్లలు చదువులు మానేయడం, ఆత్మహత్యల బారిన పడడం దేశ పాలకులను, కొందరు స్వయం ప్రకటిత మేధావులను ఏ మాత్రం చలింపచేయడంలేదు. ఎవరైనా ప్రశ్నిస్తే రెడీమేడ్ సమాధానాలు వుండనే వున్నాయి. 'చదువుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు కారణాల'ని చిలక పలుకులు పలుకుతారు. భవిష్యత్‌పై ఎంతో ఆశతో కష్టపడి చేరుకున్న ఐఐటి, ఐఐఎం, కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుండి సర్టిఫికెట్లు లేకుండానే వెనక్కు రావడం, నిర్జీవులుగా తిరిగి రావడం దేశానికి ఎంతో నష్టం. కేవలం తాము పుట్టిన కులం వల్లనే ఈ దుస్థితి రావడం నేడు భారతదేశ విద్యారంగం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన ఆధునిక సామాజిక వివక్షకు నిదర్శనం.

ఉన్నత విద్యాలయాల్లో డ్రాపౌట్లు ఎందుకు?

చదువులు మధ్యలోనే మానేయడం ప్రాథమిక, ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీల్లోనే కాదు. ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో కూడా కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పార్లమెంట్‌లో బిఎస్‌పికి చెందిన రితేష్ పాండే అడిగిన ప్రశ్నకు విద్యాశాఖ సహాయ మంత్రి సమాధానం చెబుతూ ఎస్.సి. ఎస్.టి, ఒబిసి లకు చెందిన 13,626 మంది విద్యార్థులు గత ఐదేళ్ళలో చదువులు అర్థంతరంగా మానేశారన్నారు. వీరిలో ఒబిసీలు 6,825, ఎస్‌సిలు 3,680, ఎస్‌టిలు 3,121 మంది ఉన్నారు. 2019లో 10,335 మంది, 2020లో 12,526 మంది, 2021లో 13,089 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖా మంత్రి పార్లమెంట్‌కు చెప్పారు. ఇందులో అత్యధికం ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు. హిందూ బంధువులారా ఐక్యం కండి అని మన దేశ విశ్వగురువు మొదలుకొని దేశ పాలకులు, (అ)ధర్మ పరిరక్షకులు ఘోషిస్తున్న కాలంలోనే అట్టడుగు కులాలకు చెందిన వేలమంది చదువులకు, జీవితాలకు దూరమయ్యారు.

విజ్ఞానం పెరిగే కొద్దీ అజ్ఞానం, అసమానత దూరం కావాలి. కాని భారతదేశంలో పాలక పార్టీలు ఎన్నికల ప్రయోజనాల కోసం ఒకవైపు సంపన్న ఉన్నత వర్గాలను చేరదీసి పాత కాలం నాటి అనాగరిక, సాంఘిక వివక్ష రూపాలను కొనసాగిస్తున్నాయి. మరోవైపు అట్టడుగు వర్గాల ఓట్ల కోసం అనివార్యంగా కొన్ని రాయితీలను అమలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అంతిమ విజేతలు ఉన్నత వర్గాల వారే. అందుకే రాజ్యాంగంలోని 17వ ఆర్టికల్‌లో 74 ఏళ్ళ క్రితం నిషేధించబడిన కుల వివక్ష నేటికీ కొనసాగుతూ మరింత ఉధృతమౌతున్నది. తరతరాలుగా ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురైన కులాలు, జాతులకు కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించకుండా సమాజ పురోగమనం సాధ్యం కాదని జాతీయోద్యమం గుర్తించింది. అందుకు అనుగుణంగా కొన్ని విధానాలను రూపొందించింది. అనేకమంది సంఘ సంస్కర్తలు తమ జీవితాన్నే ధారపోసి అభ్యుదయ, ప్రజాతంత్ర భావాల విస్తరణకు కృషి చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుండి... కులవివక్ష, ఆర్థిక దోపిడీలకు వ్యతిరేకంగా క్రియాశీలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించింది. వీటన్నిటి ఫలితంగా మన రాజ్యాంగంలో రిజర్వేషన్ సదుపాయం కల్పించబడింది. దీన్ని సహించ లేని శక్తులు నాడు కొన్ని ఉన్నాయి. నేడు ఆ శక్తుల ప్రతినిధులు దేశ అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. రిజర్వేషన్ల మీద, వాటికి అండగా ఉన్న రాజ్యాంగం మీద దాడిని ఎక్కుపెట్టారు. రాజ్యాంగాన్ని మార్చేయాలని ప్రయత్నిస్తున్నారు. అందుకు అనుగుణంగా భావజాలాన్ని సృష్టిస్తున్నారు. ఈ భావజాలం తలకెక్కిన విద్యార్థులు, ప్రొఫెసర్లు రిజర్వేషన్ వల్ల విద్యావకాశాలు పొందిన విద్యార్థుల మీద తీవ్రమైన మానసిక వేధింపులు, అవమానాలకు పాల్పడుతున్నారు. తరగతి గది మొదలు, లైబ్రరీ, ఆటస్థలం, హాస్టల్ ఇలా ప్రతి చోటా ఈ వేధింపులు కొనసాగుతున్నాయి. మెరిట్ (ప్రతిభ)కు పాడెగట్టిన విద్యార్థులుగా, ఫ్రీ ఫుడ్ స్టూడెంట్లుగా... ఇలా రకరకాల పేర్లతో కింది వర్గాల విద్యార్థులు నిత్యం అవమానించబడుతున్నారు. అనేక యూనివర్శిటీలలో మెస్ హాళ్లలో నాన్ వెజిటేరియన్ విద్యార్థులను ప్రత్యేకంగా కూర్చోబెట్టడం, వారు ఉపయోగించే ప్లేట్లు, గ్లాసులు వేరుగా ఉంచడం లాంటి వికృత చేష్టలు పెరిగి పోతున్నాయి. రిజర్వేషన్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందకుండా లేదా ఉత్తీర్ణత సాధించకుండా ప్రొఫెసర్లు అడ్డుకుంటున్న సంఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. పిహెచ్‌డి లు చేయడానికి అనేక ఆటంకాలు కల్పిస్తున్నారు. ఈ ఒత్తిళ్ళను తట్టుకోలేని విద్యార్థులు చదువులను మధ్యలోనే మానేయడం లేదా ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతున్నది. వీటన్నింటికి మూలం పాలక పార్టీలు తమ ఎన్నికల ప్రయోజనాల కోసం పెంచి పోషిస్తున్న కుల, మత రాజకీయాలు. ప్రధాని మొదలు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మత క్రతువులు, కుల సభలకు ముఖ్య అతిథులుగా హాజరై కులాల మధ్య చిచ్చును రగిలిస్తున్నారు. వీటి ప్రభావం విద్యాలయాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.

పసి వయసులోనే దిగువ కులాల పట్ల చులకన భావాన్ని కలిగించడానికి పాఠ్యపుస్తకాల ద్వారా ప్రయత్నిస్తున్నారు. కేంద్రీయ పాఠశాలల ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో అడిగిన ప్రశ్న, జవాబు చూడండి. 'దళిత్ అంటే అర్థం ఏమిటి?' దీనికి సమాధానాలు విదేశీయులు, అంటరానివారు, మధ్యతరగతి వారు, పై తరగతివారు. అంటరానితనం నేరం అని 1955లో చేసుకున్న చట్టానికి విరుద్ధంగా ఇలాంటి ప్రశ్నలు అడుగుతున్న వారిని శిక్షించాల్సిన ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే ఉదాసీనంగా ఉంటున్నాయి. ఈ 'హిందూ బంధువులు' భవిష్యత్ తరాలకు ఏమి నేర్పదలుచుకున్నారు? విశ్వవిద్యాలయాల్లో కుల వివక్ష ఎలా, ఎన్ని రూపాల్లో కొనసాగుతుందో ఢిల్లీ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ ఎన్. సుకుమార్ దేశవ్యాప్తంగా కేంద్ర మరియు రాష్ట్ర యూనివర్శిటీలలో చదువుతున్న 600 మంది దళిత కులాలకు చెందిన విద్యార్థుల ఇంటర్వ్యూలతో రాసిన 'క్యాస్ట్ డిస్‌క్రిమినేషన్ అండ్ ఎక్స్‌క్లూజివ్ ఇన్ ఇండియన్ యూనివర్శిటీస్, ఎ క్రిటికల్ రిఫ్లెక్షన్' అనే పుస్తకంలో కుల వివక్ష రూపాలను వివరించారు.

అధ్యాపక నియామకాల్లోనూ వివక్ష

వంద శాతం ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఐఐటి, ఐఐఎం, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, యూనివర్శిటీలలో ఎస్.సి అధ్యాపకులు 15 శాతం, ఎస్.టి 7.5 శాతం, ఒబిసి వారు 27 శాతం ఉండాలని 2008లో కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. కానీ ఆచరణలో ఇది ఘోరంగా ఉల్లంఘించబడుతున్నది. ఉదా: ఢిల్లీ లోని ఐఐటిలో 27 డిపార్ట్‌మెంట్లు వుండగా 14 విభాగాలలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన ఒక్క ఫ్యాకల్టీ లేరు. 24 డిపార్ట్‌మెంట్లలో ఎస్‌సి, 15 డిపార్ట్‌మెంట్లలో ఎస్‌టి, 9 డిపార్ట్‌మెంట్లలో ఒబిసి గ్రూపులకు చెందిన ఫ్యాకల్టీ లేరు. దేశ రాజధాని లోని విద్యాలయంలోనే ఈ పరిస్థితి వుంటే మిగిలిన యూనివర్శిటీలలో దిగువ కులాలకు చెందిన అధ్యాపక నియామకాలు ఎలా ఉంటాయో ఊహించవచ్చు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు చదువులు మానేయడానికి, ఆత్మహత్యలు చేసుకోవడానికి ఈ అధ్యాపకులు లేకపోవడానికి ప్రత్యక్ష సంబంధం ఉంది.

కుల, మత రాజకీయాలు-సాంఘిక అసమానతలు

సాంఘిక సమానత అనే భావం మత రాజకీయాలకు పూర్తిగా వ్యతిరేకమైంది. రంగును బట్టి, వృత్తిని బట్టి వివక్ష రూపాలు వుండాలని సామాజిక అసమానతలు సహజమైనవని ప్రజలను నమ్మించేందుకు ఈ మతోన్మాదులు అనేక రూపాల్లో ప్రయత్నిస్తున్నారు. దేశవ్యాప్తంగా ధర్మ పరిరక్షకుల అవతారం ఎత్తిన కొద్దిమంది ప్రవచనకారులు తమ వాగ్ధాటితో కుల అసమానతలు పెంచి పోషిస్తున్నారు. అనేక పట్టణాల్లో 'ఫలానా కులం వారికి మాత్రమే ఇల్లు అద్దెకు ఇవ్వబడును' అనే బోర్డులు బహిరంగంగా ప్రదర్శించడం వెనుక ఈ శక్తుల పాత్ర ఉంది. కులం వాసన లేని దేశాలు కూడా కుల వివక్షకు వ్యతిరేకంగా చట్టాలు చేసే స్థాయికి మన దేశ కుల వ్యవస్థ దుర్గంధం చేరింది. ఆధునిక జీవితానికి ఇంగ్లీషు విద్య తప్పనిసరి అని చెబుతున్న పాలకులు, వారి వంధిమాగధులు ఆధునిక వేషాలు వేసుకున్న అనేకమందిలో కుల భావాలు, కుల వివక్ష పాటించే పద్ధతులు ఎందుకు ఉన్నాయో చెప్పాలి. విద్యాలయాల్లో సంఘటిత విద్యార్థి ఉద్యమాలను, ప్రజాస్వామిక వాతావరణాన్ని పాలక పార్టీలు బలహీనం చేసి, తాతల కాలం నాటి తిరోగామి భావాల కేంద్రాలుగా మార్చేందుకు...భావిభారత పౌరులను మాదక ద్రవ్యాలకు బానిసలుగా తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వామపక్ష విద్యార్థి ఉద్యమం బలంగా ఉన్న చోటే సామాజిక వివక్ష వ్యతిరేక వాతావరణం బలంగా ఉంది. అలాంటి విద్యార్థి ఉద్యమాలను ప్రోత్సహించడం నేటి ప్రజాతంత్ర వాదులందరి కర్తవ్యం.

(వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు)

★

ఉక్రెయిన్ పోరుపై పశ్చిమ దేశాల మల్లగుల్లాలు !

అంతర్జాతీయం

'అదిగో పుతిన్ సేనలను తరిమి కొడుతున్నాం. ఇదిగో రష్యా ఆధీనంలోకి వెళ్లిన ప్రాంతాలను తిరిగి తెచ్చుకుంటున్నాం.' అని గడచిన 658 రోజులుగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికా, పశ్చిమ దేశాల నేతలు చెబుతూనే ఉన్నారు. పరిస్థితిలో మార్పు లేదు. రష్యా సైనిక చర్య కొనసాగుతూనే ఉంది. తమ ఆధీనంలోకి వచ్చిన ప్రాంతాలతో సహా త్వరలో ఎన్నికలు జరపబోతున్నామని ప్రకటించింది. దీంతో పశ్చిమ దేశాలు మరోసారి ఉక్రెయిన్ మీద దృష్టి సారించాయి. పోతున్న పరువును నిలుపుకొనేందుకు కొత్త ఎత్తుగడల గురించి మల్లగుల్లాలు పడుతున్నాయి. దాన్లో భాగంగానే హడావుడిగా జెలెన్‌స్కీని సోమవారం నాడు వాషింగ్టన్ రప్పించారు. ప్రారంభంలో తగిలిన ఎదురుదెబ్బల తరువాత రష్యా మిలిటరీ కొత్త వ్యూహాలను అనుసరిస్తున్నది. గతం కంటే ఎక్కువగా సైనికులు, క్షిపణులు, మందుగుండును సమకూర్చుకుంది. ఇరాన్ నుంచి పెద్ద సంఖ్యలో యుద్ధ రంగంలో వినియోగించే డ్రోన్లను సమీకరించింది. పశ్చిమ దేశాలు మిలిటరీ, ఆర్థికసాయం ఎంత చేసినా ఫలితం లేకపోవటంతో అమెరికా యంత్రాంగంలో ఆందోళన మొదలైంది. సైనిక చర్య వచ్చే ఏడాది కూడా కొనసాగితే అది జో బైడెన్ ఎన్నికల మీద ప్రభావం చూపుతుంది. ఓడిపోతున్న ఉక్రెయిన్‌కు మనమెందుకు సాయం చేయాలని ప్రతిపక్ష రిపబ్లికన్లు ప్రశ్నిస్తున్నారు. దిక్కుతోచని జో బైడెన్ గత వారంలో పార్లమెంటులో మాట్లాడుతూ పుతిన్‌ను గెలవనివ్వకూడదు. అది మన జాతీయ, మన స్నేహితుల అంతర్జాతీయ ప్రయోజనాలతో ముడిపడి ఉంది. ఉక్రెయిన్‌కు మన సాయంలో అంతరాయం ఏర్పడితే పుతిన్ స్థానం బలపడుతుందని వాపోయాడు. వచ్చే ఏడాది జర్మనీలో జరిపే యుద్ధ విన్యాసాల తరువాత కొత్త ఎత్తుగడలకు ఒక రూపం వస్తుందని భావిస్తున్నారు. కొత్త వ్యూహంతో ముందుకు పోనట్లయితే ఓడే అవకాశం ఉందని అమెరికా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 111 బిలియన్ డాలర్ల సాయం చేశామని, అదంతా బూడిదలో పోసిన పన్నీరైనందున ఇంక సాయం అనవసరమని రిపబ్లికన్లు పెదవి విరుస్తున్నారు. ఇచ్చినదానితో సర్దుకొని పోరుసాగించాలి తప్ప ఎక్కువగా ఆశించవద్దని కూడా పరోక్షంగా సందేశాలిస్తున్నారు. ఎంత ఇస్తామనేది పక్కన పెడితే రానున్న సంవత్సరంలో గత రెండు సంవత్సరాలలో చేసిన మాదిరి సాయం చేసే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు.

రానున్న రోజుల్లో గట్టి ప్రతిఘటన ఇస్తే వచ్చే ఏడాది చివరికి లేదా 2025లో రష్యాతో సంప్రదింపులకు అర్థం ఉంటుందని, భారం మొత్తం ఉక్రెయిన్ మీద పెట్టే విధంగా అమెరికన్లు మాట్లాడుతున్నారు. ఎత్తుగడలను మార్చకపోతే మొదటి ప్రపంచ యుద్ధంలో 1916లో పెద్ద సంఖ్యలో సైనికులను పోగొట్టుకున్నా సాధించిందేమీ లేనట్లుగా ఉక్రెయిన్ పరిస్థితి ఉంటుందని హెచ్చరించినట్లు న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాసింది. ఎదురుదాడుల పేరుతో ఉక్రెయిన్ ప్రారంభించిన చర్యల్లో పెద్ద సంఖ్యలో మరణించిన, గాయపడిన సైనికులు ఉన్నట్లుగా కూడా పేర్కొన్నది. వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా వైఫల్యం మాదిరి 2023లో ఉక్రెయిన్ పరిస్థితి ఉందని విమర్శకులు పేర్కొన్నారు. చివరి యత్నంగా అమెరికా స్వయంగా తన సీనియర్ కమాండర్లు ఆంటోనియో అగుటో జూనియర్ వంటి వారు ఎక్కువ సమయం కీవ్‌లో, జర్మనీలో ఉండి సమన్వయం చేసేందుకు పంపాలని నిర్ణయించింది. ఉక్రెయిన్ ఎదురు దాడుల్లో సాధించిందేమీ లేకపోగా అమెరికా అంచనా వేసినదాని కంటే రష్యా సేనలు బలంగా ఉన్నట్లు తేలింది. అంతేకాదు రష్యా ఎంతగా తన సేనలను బలపరుచుకుంటున్నదన్న అంచనాలో కూడా అమెరికా విఫలమైంది. ప్రస్తుతం ఇరవై శాతం ఉక్రెయిన్ ప్రాంతం రష్యా ఆధీనంలో ఉంది. కోల్పోయిన ప్రాంతాలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకోవాలని చూడవద్దని అమెరికా అంటోంది. యుద్ధం ముగియాలంటే ఉక్రెయిన్ కొంత భాగాన్ని రష్యాకు కోల్పోవాల్సి ఉంటుందని జెలెన్‌స్కీ రాక సందర్భంగా అమెరికా రిపబ్లికన్ సెనెటర్ జెడి వాన్స్ చెప్పాడు.

యుద్ధం త్వరగా ముగియాలని మేము ఎంతగా కోరుకుంటున్నప్పటికీ సమీప కాలంలో ఉక్రెయిన్ పోరు ముగిసేట్లు లేదని, అందుకే ఒత్తిడిని మరింత పెంచాల్సి ఉంటుందని జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ అధికార సోషల్ డెమోక్రటిక్ పార్టీ సమావేశంలో చెప్పాడు. మేం వూరికే వదలి పెడతామని పుతిన్ అనుకోవద్దని కూడా అన్నాడు. అమెరికా తరువాత ఉక్రెయిన్‌కు అతి పెద్ద మద్దతుదారుగా జర్మనీ ఉంది, భారీ మొత్తంలో ఆయుధాలను అందిస్తున్నది. పాలస్తీనా లోని గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతున్నందున ఉక్రెయిన్‌కు అమెరికా అదనపు సాయం అందకపోతే ఉక్రెయిన్ గతి ఏమిటని అనేక మంది పశ్చిమ దేశాల విశ్లేషకులు ఆందోళన వెల్లడిస్తున్నారు.

ఎం. కోటేశ్వరరావు

యుద్ధం త్వరగా ముగియాలని మేము ఎంతగా కోరుకుంటున్నప్పటికీ సమీప కాలంలో ఉక్రెయిన్ పోరు ముగిసేట్లు లేదని, అందుకే ఒత్తిడిని మరింత పెంచాల్సి ఉంటుందని జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ అధికార సోషల్ డెమోక్రటిక్ పార్టీ సమావేశంలో చెప్పాడు. మేం వూరికే వదలి పెడతామని పుతిన్ అనుకోవద్దని కూడా అన్నాడు. అమెరికా తరువాత ఉక్రెయిన్‌కు అతి పెద్ద మద్దతుదారుగా జర్మనీ ఉంది, భారీ మొత్తంలో ఆయుధాలను అందిస్తున్నది. పాలస్తీనా లోని గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతున్నందున ఉక్రెయిన్‌కు అమెరికా అదనపు సాయం అందకపోతే ఉక్రెయిన్ గతి ఏమిటని అనేక మంది పశ్చిమ దేశాల విశ్లేషకులు ఆందోళన వెల్లడిస్తున్నారు. మార్చి నాటికి పది లక్షల ఫిరంగి గుండ్లను అందించాలన్న లక్ష్యం నెరవేరేట్లు కనిపించటం లేదని, మరోవైపు ఉత్తర కొరియా నుంచి అంతకంటే ఎక్కువగా రష్యా పొందవచ్చని చెబుతున్నారు. తమ కంటే పది నుంచి 30 రెట్ల వరకు ఫిరంగి గుండ్లు రష్యన్ల వద్ద ఉన్నాయని ఒక ఉక్రెయిన్ సైనికుడు చెప్పినట్లు జర్మన్ పత్రిక డెర్ స్పీగల్ రాసింది.

ఆంక్షలతో పశ్చిమ దేశాలు తమ బ్యాంకుల్లో ఉన్న రష్యా సొమ్ము 300 బిలియన్ యూరోలను స్థంభింప చేసినా, అనేక ఆంక్షలను విధించి అమలు జరుపుతున్నా ఇప్పటి వరకు పుతిన్ తట్టుకొని నిలిచాడు. పశ్చిమ దేశాలు వేసిన అంచనాలన్నీ తప్పాయి. చైనాతో సంబంధాలను పెంచుకొని పశ్చిమ దేశాల ఆంక్షలను నిర్వీర్యం చేశాడు. ఆంక్షల కారణంగా గతేడాది ఆర్థిక ఉత్పత్తి 2.1 శాతం తగ్గినా ఈ ఏడాది 2.8 శాతం పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. జనాభాలో 80 శాతం మంది పుతిన్‌కు మద్దతు పలుకుతున్నట్లు సర్వేలు తెలిపాయి. అయితే రానున్న రోజుల్లో ఆర్థిక సవాళ్లను కూడా తక్కువగా అంచనా వేయనవసరం లేదు. తొలి దశలో మాదిరి దూకుడుగా ముందుకు పోకుండా మధ్యలో గట్టి దెబ్బలు కొడుతూ ఉక్రెయిన్‌కు ఊపిరి సలపకుండా రష్యా చూస్తున్నది. అలసిపోయి దారికి రాక తప్పదనే అంచనాలో ఉంది. వచ్చే ఏడాది మార్చి 17వ తేదీన జరిగే ఎన్నికల్లో మరోసారి పుతిన్ పోటీ చేయనున్నట్లు వార్తలు వచ్చాయి.

సరిగ్గా జెలెన్‌స్కీ వాషింగ్టన్ పర్యటనకు వెళ్లినపుడే తాము నిర్మిస్తున్న అణు జలాంతర్గాములలో రెండింటిని మిలిటరీకి అప్పగించినట్లు ప్రకటించారు. మొత్తం ఎనిమిదింటిని రష్యా నిర్మిస్తున్నది. ఇటీవలి కాలంలో పుతిన్ రక్షణ ఖర్చును భారీగా పెంచుతున్నట్లు ఎకానమిస్ట్ పత్రిక పేర్కొన్నది. వచ్చే ఏడాది జిడిపిలో ఆరు శాతానికి పెంచనున్నారని, ఇది సోవియట్ యూనియన్ కూలిన తరువాత ఎక్కువ అని పేర్కొన్నది. రష్యా వృద్ధి రేటు ఈ ఏడాది ప్రారంభంలో ఒక ఒక శాతం ఉండగా మూడు శాతానికి పెరుగుతుందని రేటింగ్ సంస్థలు పేర్కొన్నాయి.

ఉక్రెయిన్ పోరు ప్రారంభంలో పశ్చిమ దేశాల ఆర్థికవేత్తలు వేసిన అంచనాలన్నీ తలకిందులయ్యాయి. విధించిన ఆంక్షలు పని చేయటం లేదు, ఈ స్థితిలో రష్యాను ఎలా దారికి తేవాలా అన్నది పశ్చిమ దేశాలకు తోచటం లేదు. ఇటీవల బెర్లిన్‌లో జరిగిన ఐరోపా యూనియన్ సమావేశంలో జరిగిన సమీక్షలో డజనుకుపైగా చైనా కంపెనీలు రష్యా మిలిటరీకి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. చైనాను వారేమీ అదుపు చేయలేరు. తొలి రోజుల్లో ఆంక్షలు పని చేసినట్లు కనిపించినా తరువాత కాలంలో వాటిని అధిగమించినట్లు నిర్ధారణకు వచ్చారు. నాటో సభ్యురాలు టర్కీ, కజకస్తాన్, ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు రష్యాకు అన్ని విధాలుగా సహకరిస్తున్నాయి. అమెరికా తయారీ మందుగుండు కూడా రష్యాకు చేరుతున్నట్లు సమావేశంలో వెల్లడైంది. కజకస్తాన్ వంటి దేశాల దిగుమతులు పెరిగిన తీరు చూస్తే మూడవ దేశాల ద్వారా ఐరోపా కంపెనీల యంత్రాలు, విడిభాగాలు రష్యాకు చేరుతున్నట్లు అనుమానిస్తున్నారు. హంగరీ, ఎస్తోనియా వంటి ఐరోపా దేశాలు రష్యాతో సంబంధాలను కలిగి ఉన్నట్లు సమీక్షలో పేర్కొన్నారు. గతంలో సోవియట్ మాదిరి ఇప్పుడు రష్యా తనకు అవసరమైన మిలిటరీ పరికరాలను నూటికి నూరు శాతం సమకూర్చుకోగలిగిన స్థితిలో ఉందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఆంక్షలను ఉల్లంఘించినట్లు ఒకవైపు చెబుతూనే అలాంటి కంపెనీలపై తీసుకున్న చర్యలేమిటో చెప్పలేని స్థితిలో ఐరోపా సమాఖ్య ఉంది. దాదాపు పదహారు వందల ఐరోపా కంపెనీలు రష్యాలో లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. కొన్ని మద్యం కంపెనీలు రష్యా నుంచి వెలుపలికి వచ్చినట్లు ప్రకటించినా వాటి ఉత్పత్తులు అక్కడ దొరుకుతున్నాయని ఐరోపా సమాఖ్య అధికారులు వాపోతున్నారు.

★

కవిత్వం

కొన్ని ప్రశ్నలు

తనువు ఉన్నాళ్ళు కూటికి
తనువు చాలించాక కాటికి
అంతమాత్రానికే ఎందుకు భేషజాలు ?

మౌనం ఆభరణమైతే
మాట తీరు అలంకారమైతే
ఇంకెందుకు విషపు ఆలోచనా బీజాలు ?

కష్టం నీకు ఇష్టమైతే
విజయం నీ స్వంతమైతే
నీకెందుకు ఈర్ష్యద్వేషాలు ?

కీర్తి కోసం పాకులాడక
స్ఫూర్తి కోసం పాటుపడితే
విమర్శలకు ఎందుకు రోషాలు ?

అందరూ బాగుండాలని
అందులో మనముండాలని
అనుకుంటే ఎక్కడది ఆత్మవంచన ?

ప్రేమించే మనసుంటే
ఆదరించే గుణముంటే
వృద్ధాప్యం చేరునా ఆశ్రమం పంచన ?

వినయం నీ వెంటుంటే
విజ్ఞత నీ చెంతుంటే
తలకెక్కినా కాదా గర్వభంగం ?

మహిళను పూజిస్తే
అమ్మని నీవు భావిస్తే
జరుగునా అతివలపై మానభంగం ?

మార్చుకుంటే ప్రవర్తన
నడచుకుంటే సత్ప్రవర్తన
జరగదా నేటి సమాజం పరివర్తన?

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్ : 7780277240

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com

గిరిజన ప్రాంతాల్లో ఓటరు గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి

- ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకు ఓటరు గుర్తింపు కార్డుల జారీకి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనాను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. గిరిజనుల్లో ఎక్కువ మందికి ఓటరు గుర్తింపు కార్డులు లేవని తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో గిరజనుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు.

46 వేల జాబ్ కార్డులు తొలగింపు

- ఉపాధి పథకంలో కోత పెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాలు తగ్గించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కొత్త ప్రణాళికలతో సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ప్రతియేటా లేబర్ బడ్జెట్ తగ్గింపు, పనిచేసే చోట సౌకర్యాలు కల్పించకపోవడం, రెండు పూటల పనులతో పాటు ఫేస్ హాజరు వంటి వాటిని పెట్టి ఉపాధి హామీ పనులకు చాలా మందిని దూరం చేస్తున్నాయి. ఇప్పుడు జాబ్ కార్డుల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 2022-23లో 46,662 జాబ్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. 2021-22లో 1,833 జాబ్ కార్డులను తొలగించిన ప్రభుత్వం ఈ ఏడాది జాబ్ కార్డుల తొలగింపులో వేగం పెంచింది. ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వలస వెళ్లినవారు, చనిపోయిన వారు లేదా అందుబాటులో లేనివారిని గుర్తించి వారి పేర్లను జాబ్ కార్డుల నుండి అధికారులు తొలగిస్తున్నారు. గ్రామీణ కార్మికులు, పేదవారి కోసం ప్రవేశపెట్టిన ఈ ఉపాధి హామీ పథకాన్ని ఒక ప్రణాళిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిర్వర్యం చేస్తోంది. దేశవ్యాప్తంగా 2021-22లో 3,06,944 జాబ్ కార్డులు తొలగించగా, 2022-23లో 7,43,457 కార్డులు తొలగించారు. ఉత్తరప్రదేశ్‌లో 2021-22లో 67,937 కార్డులు తొలగించగా, 2022-23కు వాటి సంఖ్య 2,96,464 వరకు పెరిగింది. ఒడిశా రాష్ట్రంలో 2021-22లో 50,817 జాబ్ కార్డులు తొలగించగా, 2022-23లో 1,14,333 కార్డులు తొలగించారు. మధ్యప్రదేశ్‌లో 2021-22 ఆర్థిక సంవత్సరంలో 27,859 జాబ్ కార్డులు తొలగించగా, 2022-23లో 95,209 కార్డులు తొలగించారు. బీహార్‌లో సంబంధిన గణాంకాలు ప్రకారం 2021-22లో 27,062 కార్డులు తొలగించగా, 2022-23లో 80,203 కార్డులు తొలగించారు. ఝార్ఖండ్‌లో 2021-22లో 23,528 జాబ్ కార్డులు తొలగించగా, 2022-23లో 70,673 కార్డులు తొలగించారు. రాజస్థాన్‌లో 2021-22లో 14,782, 2022-23లో 45,646 జాబ్ కార్డులు తొలగించారు.

విద్యా వ్యవస్థలో మార్పులే అగ్రస్థానంలో నిలిపాయి

- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మకమైన మార్పులతోనే దేశంలో ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో మొదటి స్థానంలో నిలిచిందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ఎన్నో వినూత్న కార్యక్రమాలు తీసుకురావడంతోనే సత్ఫలితాలు వచ్చాయన్నారు. మంగళవారం విజయవాడలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఆర్‌జెడిలు, ఆర్‌ఐఒలు, డిఇఒలు, డివిఇఒలు, ఎపిసిలకు వర్క్‌షాపు జరిగింది. దీనికి మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర స్థాయి సమీక్షల్లోనూ రాష్ట్ర విద్యా వ్యవస్థ ముందంజలో ఉందని, మన విద్యా సంస్కరణలు ఇతర రాష్ట్రాలు వారు సైతం ఆచరించేందుకు మక్కువ చూపుతున్నారని తెలిపారు. ఇందుకు కారణం అధికారులు, ఉపాధ్యాయుల సహకారమేనని అన్నారు. పాఠశాలల్లో స్మార్ట్ టివిలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన ట్యాబులను సద్వినియోగపరుచుకుంటూ డిజిటల్ విద్యా విధానంలో సాంకేతిక దిశగా పయనించాలని సూచించారు. విద్యా వ్యవస్థ కోసం రాష్ట్రం వివిధ పథకాల ద్వారా దాదాపు రూ.50 వేల కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. రాష్ట్రంలో 200 స్టెమ్ ల్యాబ్స్ ఏర్పాటుకు కనెక్ట్ ఆంధ్రాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల తనిఖీ, పర్యటనకు సంబంధించిన మొబైల్ యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్ కుమార్, ఇంటర్మీడియట్ విద్య కమిషనరు సౌరభ్ గౌర్, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి శ్రీనివాసరావు, కనెక్ట్ ఆంధ్రా సిఇఒ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి కాంగ్రెస్ కీలక సమావేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతలతో కీలక సమావేశాలు నిర్వహించుకోవాలని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నిర్ణయించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఈ నెల 13, 14, 15 తేదీల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాలకు కాంగ్రెస్ ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఆఫీసు సెక్రటరీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

6న జెఎన్‌టియు స్నాతకోత్సవం

- ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

జనవరి ఆరున జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఉపకులపతి రంగజనార్ధన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలుపుతూ రాజ్‌భవన్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. కాగా ఇప్పటికే స్నాతకోత్సవానికి సంబంధించిన నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కమిటీలకు కేటాయించిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్నాతోకోత్సవం పండుగలా జరగాలని సూచించారు. స్నాతకోత్సవ సందర్భంగా పిహెచ్‌డి పట్టాలు, బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

బిల్లులు రాక.. పనులు సాగక

- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

12	55-26బి	0.02	0.01	రై. పుంజ	రేగాన అసిరియ్య తండ్రి సూరయ్య	పట్టాదారుడు	26ఎ	28,29	27బి	29	
					రేగాన బుల్లోడు తండ్రి సన్యాసి	పట్టాదారుడు					
					పట్నాన అప్పడు తండ్రి సరవయ్య	పట్టాదారుడు					
					రేగాన కొండయ్య తండ్రి కొండయ్య తాత	పట్టాదారుడు					
					రేగాన బుచ్చోడు తండ్రి గురవయ్య	పట్టాదారుడు					
					రేగాన ఆశిరయ్య తండ్రి గురవయ్య	పట్టాదారుడు					
					రేగాన సన్యాసమ్మ భర్త గురువులు	అనుభవదారుడు					
13	55-28	0.05	0.05	రై. పుంజ	రేగాని అసిరియ్య తండ్రి గురయ్య	పట్టాదారుడు	26బి	37బి	27బి	28	
					రేగాన సన్యాసమ్మ భర్త గురువులు	అనుభవదారుడు					
14	55-37బి	0.24	0.19	రై. పుంజ	పట్నాన అక్కులు తండ్రి సరవయ్య	పట్టాదారుడు	27బి ,28, 29	37ఎ	38	36	
					పట్నాన బోడయ్య తండ్రి అక్కులు	అనుభవదారుడు					
					పట్నాన రామయ్యమ్మ భర్త బంగారి	అనుభవదారుడు					
15	55-27బి	0.05	0.04	రై. పుంజ	రేగాన తాతయ్య తండ్రి కొండయ్య	పట్టాదారుడు	27ఎ	37బి	19బి	28	
					రేగాన అసిరోడు	అనుభవదారుడు					
16	55-19బి	0.10	0.08	రై. పుంజ	పట్నాన అక్కులు తండ్రి సరవయ్య	పట్టాదారుడు	19ఎ	38	18బి	27బి	
					పట్నాన బోడయ్య తండ్రి అక్కులు	అనుభవదారుడు					
17	55-18బి	0.15	0.08	రై. పుంజ	రేగాన సూరయ్య తండ్రి సన్యాసి	పట్టాదారుడు	18ఎ	39	సర్వే నెం.52	19బి	
					రేగాన బుల్లోడు తండ్రి సన్యాసి	పట్టాదారుడు					
					పట్నాన అప్పడు తండ్రి సరవయ్య	పట్టాదారుడు					
					రేగాని కొండయ్య తండ్రి కొండయ్య తాత	పట్టాదారుడు					
					రేగాన బుచ్చోడు	పట్టాదారుడు					
					రేగాన ఆశిరయ్య తండ్రి సురయ్య	పట్టాదారుడు					
					పట్నాన బోడయ్య తండ్రి అక్కులు	అనుభవదారుడు					
18	55-38	0.12	0.12	రై. పుంజ	రేగాని సన్యాసి తండ్రి సూరప్పడు	పట్టాదారుడు	19బి	సర్వే నెం.54	39	37బి	
					రేగాన సూరప్పడు తండ్రి బంగారి	అనుభవదారుడు					
19	55-39	0.12	0.12	రై. పుంజ	రేగాని సన్యాసి తండ్రి బుల్లోడు	పట్టాదారుడు	18బి	సర్వే నెం.54	సర్వే నెం.52	38	టేకు మొక్కలు- 50
					రేగాన బంగారి తండ్రి అసిరోడు	అనుభవదారుడు					
		మొత్తం:	2.02								

సం/-నాగలక్ష్మి,ఎస్, ఐ.ఏ.యస్ ,
జిల్లా కలెక్టర్, విజయనగరం

సిఇసి, ఇసి నియామకాల బిల్లుకు
రాజ్యసభ ఆమోదం

• ప్రతిపక్షాల వాకౌట్ • లోక్‌సభలో రెండు బిల్లులు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సర్వీస్ షరతులు, పదవీకాలం) బిల్లును రాజ్యసభ ఆమోదించింది. ఈ బిల్లు ఎన్నికల సంఘం స్వతంత్రతను తొలగించి ప్రభుత్వ కమిటీగా దాని స్థాయిని కుదించిందని విమర్శిస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశాయి. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలంటూ ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పక్కనపెట్టేందుకు మోడీ ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొచ్చింది. మంగళవారం రాజ్యసభలో ఈ బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం ఈ బిల్లుపై చర్చ జరిగింది. వివిధ పార్టీల నేతలు మాట్లాడిన తరువాత బిల్లును మూజువాణి ఓటు ఆమోదం పొందింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ ఈ బిల్లు సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకం కాదని, ఇది అత్యున్నత న్యాయస్థానం అందించిన సూచనలపై ఆధారపడి ఉందని అన్నారు.

బిల్లులో ఏముంది?

ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కేంద్ర మంత్రితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్లను నిర్ణయించాలని బిల్లు నిర్దేశించింది. కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర మంత్రిని ఉంచారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానమైన జీతం, ప్రయోజనాలు లభిస్తాయని ప్రభుత్వం బిల్లులో సవరణ తెచ్చింది. తొలిసారిగా ప్రవేశపెట్టిన బిల్లులో కేబినెట్ సెక్రటరీకి సమానంగా జీతం ఇవ్వాలని నిబంధన పెట్టారు. ఇది ఎన్నికల కమిషనర్ల స్థాయిని తగ్గించినట్లేనన్న విమర్శలు తలెత్తినప్పుడు ప్రభుత్వమే సుప్రీంకోర్టు న్యాయమూర్తికి చెల్లించే జీతం చెల్లించేలా సవరణ తీసుకొచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్లు తమ విధులను నిర్వర్తిస్తున్నప్పుడు అన్ని క్రిమినల్, సివిల్ దావాల నుండి రక్షణను కూడా బిల్లు అందిస్తుంది. మంత్రులను కనుగొనే సెర్చ్ కమిటీని కూడా మార్చారు. మొదటి ప్రతిపాదిత బిల్లులో క్యాబినెట్ కార్యదర్శి, మరో ఇద్దరు సీనియర్ అధికారులతో కూడిన సెర్చ్ కమిటీ ఎన్నికల కమిషనర్ పదవికి పరిగణించదగిన వారి జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. సెర్చ్ కమిటీ ఐదుగురిని సిఫార్సు చేయవచ్చు. కేబినెట్ సెక్రటరీ స్థానంలో న్యాయశాఖ మంత్రిని సెర్చ్ కమిటీకి అధిపతిగా నియమిస్తూ ప్రభుత్వం సవరణ తీసుకొచ్చింది.

బిల్లుపై చర్చలో ప్రతిపక్షాలు

కాంగ్రెస్ ఎంపి ఐమీ యాజ్నిక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం శరీరంపై ఎవరో కూర్చోన్నారని విమర్శించారు. ఈ బిల్లు మన ప్రజాస్వామ్య పునాదిని కదిలించేలా ఉందని టిఎంసి ఎంపి జవహర్ సిర్కార్ అన్నారు. "ప్రజాస్వామ్యం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలపై ఆధారపడి ఉంది" అని అన్నారు. బిల్లులోని క్లాజ్ 8 మరింత ప్రమాదకరమని అన్నారు. "(ఇది) ఎవరినైనా చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్లుగా నియమించవచ్చని చెబుతోంది. మీరు ఎంత ప్రమాదకరమైన దృష్టాంతాన్ని తెరుస్తున్నారు!" అంటూ మోడీ సర్కార్ పై విమర్శలు గుప్పించారు. ఈ బిల్లు రిగ్గింగ్‌ను చట్టబద్ధం చేయడానికి దారితీస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయాలను బిజెపి ప్రభుత్వం గౌరవించడం లేదని అని ఆప్ ఎంపి రాఘవ్ చద్దా విమర్శించారు. "ఈ బిల్లు దేశంలో మిగిలి ఉన్న కొన్ని స్వతంత్ర సంస్థల్లో ఒకటైన ఎన్నికల కమీషన్‌ను నాశనం చేస్తుంది. తద్వారా దేశం నుండి స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలను తరిమికొడుతుంది" అని చద్దా అన్నారు. ఈ బిల్లు సుప్రీంకోర్టును, భారత ప్రధాన న్యాయమూర్తిని అగౌరవపరిచేదిగా ఉందని విమర్శించారు.

లోక్‌సభలో రెండు బిల్లుల ఆమోదం

కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్ముకాశ్మీర్, పుదుచ్చేరి అసెంబ్లీల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను లోక్‌సభ ఆమోదించింది. పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ (106వ సవరణ) చట్టంలోని నిబంధనలను జమ్ముకాశ్మీర్, పుదుచ్చేరిలకు విస్తరిస్తూ రెండు బిల్లులను మంగళవారం ఆమోదించింది. ఈ బిల్లులను హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. రాజ్యంగ (106వ సవరణ) చట్టంను కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ముకాశ్మీర్, పుదుచ్చేరిలో అమలు చేయడానికి జమ్ముకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (రెండో సవరణ), కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు అనే రెండు బిల్లులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ బిల్లులను మూజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది. ఆమోదానికి ముందు ఈ బిల్లులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు సోమవారం ఇచ్చిన తీర్పును ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. సుప్రీం తీర్పుతో నిరాశకు గురయ్యామని నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన హస్నైన్ మసూది తెలిపారు. జమ్ముకాశ్మీర్‌లో గత ఆరేళ్లుగా ఎమ్మెల్యేలు లేరని, 'నలుగురు అధికారులే' ఆ ప్రాంతాన్ని నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల నిర్వహించడం, రాష్ట్ర హోదా పునరుద్ధరణ గురించి కూడా సుప్రీంకోర్టు మాట్లాడిందని, కానీ కేంద్రం దీనిని విస్మరిస్తోందని ఆరోపించారు. డిఎంకె ఎంపి ఎ.రాజా మాట్లాడుతూ భారత్‌లోకి చేరే సమయంలో జమ్ముకాశ్మీర్‌కు రాజ్యాంగ సంస్థలు చేసిన హామీలు ఇప్పుడు 'గాలిలో వేలాడుతున్నాయి' అని పేర్కొన్నారు. మంగళవారం 2023-2024కి మొదటి బ్యాచ్ - గ్రాంట్స్ కోసం అనుబంధ డిమాండ్లను కూడా లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి నిర్దిష్ట మొత్తాల చెల్లింపులు, 2020-2021కి అదనపు గ్రాంట్ల డిమాండ్‌లను ముజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది.

లోక్‌సభలో మూడు క్రిమినల్ చట్టాల సవరణ బిల్లులు

మూడు క్రిమినల్ లా బిల్లులను మార్పులు చేసిన తరువాత మంగళవారం తిరిగి లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. ఆగస్టులో లోక్‌సభలో ప్రవేశపెట్టిన మూడు కొత్త క్రిమినల్ లా బిల్లులను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బిల్లులు ఆగస్టు 18న హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపారు. పార్లమెంటరీ ప్యానెల్ చేసిన సిఫార్సులలో కొన్నింటిని చేర్చడం కోసం బిల్లులను ఉపసంహరించుకున్నట్లు హోం మంత్రి అమిత్ షా సభకు తెలిపారు. మార్పులు చేసిన బిల్లులను మంగళవారం ప్రవేశపెట్టారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఎ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి)లను మార్చుతూ భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) బిల్లు, భారతీయ సాక్ష్యా అధినియం (బిఎస్) బిల్లు, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) బిల్లుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ "మూడు బిల్లులలో ప్రధాన మార్పులు 3-4 ఉపవిభాగాలలో ఉన్నాయి. ఇతర మార్పులు ప్రధానంగా వ్యాకరణ స్వభావాన్ని కలిగి ఉంటాయి. బిల్లుల మార్పులపై గురువారం 12 గంటల పాటు చర్చ జరుగుతుంది. అప్పుడు సమాధానం చెబుతాం" అని ఆయన పునరుద్ఘాటించారు. బిల్లులను కూలంకషంగా అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు.

Dr. John Brittas, CPI(M), Kerala

ఎన్నికల సంఘాన్ని అదుపులో ఉంచేలా బిల్లు

- ఎలక్టోరల్ బాండ్లు ఎన్నికల కుంభకోణం
- సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పని చేయాల్సిన ఎన్నికల సంఘాన్ని పూర్తిగా లొంగదీసుకునేలా చీఫ్ ఎలక్షన్ కమిషనర్, కమిషనర్ల నియామక బిల్లును కేంద్రప్రభుత్వం రూపొందించిందని సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్‌బ్రిట్టాస్ విమర్శించారు. రాజ్యసభలో బిల్లుపై మంగళవారం జరిగిన చర్చలో సిపిఎం తరపున ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆదేశాలను పక్కనపెట్టడానికి, ఎన్నికల కమిషన్‌ను నియంత్రణలో ఉంచడానికి ఈ బిల్లు ఉద్దేశించబడిందని విమర్శించారు. కాశ్మీర్ తీర్పు తరువాత, ప్రభుత్వం సుప్రీంకోర్టును ప్రశంసించిందని, మరుసటి రోజు అదే కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తోందని విమర్శించారు. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఉత్తర్వు ఎన్నికల కమిషన్ విశ్వసనీయత, నిష్పాక్షికత, స్వతంత్రతను నిర్ధారించే లక్ష్యంతో ఉందన్నారు. ప్రభుత్వం దానిని తారుమారు చేస్తోందని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్‌కు ప్రత్యేక కార్యాలయం అవసరమా? దాన్ని మూసేసి న్యాయమంత్రిత్వ శాఖలో పెడితే సరిపోతుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘాన్ని మరో ప్రభుత్వ శాఖగా మారుస్తున్నారని విమర్శించారు. ఇది రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలకు కారణమవుతుందని హెచ్చరించారు. దేశంలో ఎన్నికల రంగం ప్రస్తుతం డబ్బు, అధికారంతో నియంత్రించబడుతుందని విమర్శించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు రూ.60 వేల కోట్ల ఖర్చు చేశాయని, ఇందులో సింహభాగం బిజెపి ఖర్చు చేసిందని తెలిపారు. 2024లో ఇది ఇంకా చాలా రెట్లు పెరుగుతుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ నిజానికి ఎన్నికల కుంభకోణమని, అసలు పారదర్శకంగా లేదని బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లు మాఫీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఐదేళ్లలో బడా కార్పొరేట్లకు రూ.10,57,326 కోట్లు మాఫీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు మంగళవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి భగవంత్ ఖరడ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2018-19లో రూ.2,36,265 కోట్లు మాఫీ చేయగా, అందులో రూ.1,29,765 కోట్లు ప్రభుత్వ బ్యాంకులు మాఫీ చేయగా, రూ.15,966 కోట్లు ప్రైవేటు బ్యాంకులు మాఫీ చేశాయి. రూ.3,023 కోట్లు విదేశీ బ్యాంకులు మాఫీ చేశాయి. 2019-20లో రూ.2,34,170 కోట్లు మాఫీ చేయగా, రూ.1,34,189 కోట్లు ప్రభుత్వ, రూ.21,199 కోట్లు ప్రైవేట్, రూ.3,750 కోట్లు విదేశీ బ్యాంకులు మాఫీ చేశాయి. 2020-21 రూ.2,02,781 కోట్లు మాఫీ చేయగా, అందులో రూ.96,232 కోట్లు ప్రభుత్వ, రూ.28,867 కోట్లు ప్రైవేట్, రూ.1,948 విదేశీ బ్యాంకులు మాఫీ చేశాయి. 2021-22 రూ.1,74,966 కోట్లు మాఫీ చేయగా, అందులో రూ.58,875 కోట్లు ప్రభుత్వ, రూ.9,037 కోట్లు ప్రైవేట్, రూ.1,613 కోట్లు విదేశీ బ్యాంకులు మాఫీ చేశాయి. 2022-23లో రూ.2,09,144 కోట్లు మాఫీ చేయగా, రూ.67,045 కోట్లు ప్రభుత్వ, రూ. 41,194 కోట్లు ప్రైవేట్, రూ.1,138 విదేశీ బ్యాంకులు రుణాలు మాఫీ చేశాయి.

ప్రధాన సమస్యల నుంచి తప్పుదోవ పట్టించేందుకే..

- అమిత్ షాకు చరిత్ర తెలియదు : రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని ప్రధాన సమస్యల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే నెహ్రూ వంటి వారిపై బిజెపి ఆరోపణలు చేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మంగళవారం పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై ఆగ్రహించారు. 'పండిత్ నెహ్రూజీ తన జీవితాన్ని ఈ దేశానికి అంకితమిచ్చారు. దేశ ప్రజల కోసం ఏళ్ల తరబడి జైల్లో ఉన్నారు. అమిత్ షాకు చరిత్ర తెలియదు. ఆయనకు చరిత్ర తెలుస్తుందని ఊహించలేం, దానిని తిరగరాసే అలవాటు ఉంది. అందుకే పదే పదే దాన్ని తిరగరాస్తూనే ఉన్నారు' అని రాహుల్ దుయ్యబట్టారు. 'ప్రాథమిక సమస్యకుల ప్రాతిపదికన జనాభా గణన, నిరుద్యోగం, దేశంలోని ధనమంతా ఎవరి చేతుల్లో ఉంది? వీటిపై చర్చించేందుకు బిజెపి భయపడుతోంది. అందుకే వీటి నుంచి పారిపోతోంది. మేము ఈ సమస్యను ముందుకు తీసుకెళ్తున్నాం' అని రాహుల్ గాంధీ అన్నారు. 'పేదలకు దక్కాల్సినవి దక్కుతాయి. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ సిఎం కూడా ఒబిసినే, వారు కూడా ఒబిసి సిఎంను ప్రకటించారన్నారు. అయితే వారిలో ఎంత శాతం మంది నిర్మాణంలో ఉన్నారనేది ప్రశ్న? పిఎం మోడీ ఒబిసి కేటగిరి, అయితే 90 మందితో ప్రభుత్వం నడుస్తోంది. వారిలో ముగ్గురు మాత్రమే ఒబిసికి చెందినవారు. వారి కార్యాలయాలు మూలన ఉన్నాయి. నా ప్రశ్న సంస్థాగత వ్యవస్థలో ఒబిసిలు, దళితులు, గిరిజనుల భాగస్వామ్యం గురించి. వారు ఈ సమస్య నుండి మనల్ని మరల్చడానికి జవహర్‌లాల్ నెహ్రూ, ఇతరుల గురించి మాట్లాడుతున్నారు' అని అన్నారు.

క్వాడ్ సదస్సు వాయిదా

- జనవరిలో బైడెన్ పర్యటన లేనట్టే!

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది భారత్‌లో నిర్వహించనున్న క్వాడ్ సదస్సు జనవరిలో జరగకపోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ 'ఏడాదిలో తర్వాత జరుగుతుందని' మాత్రమే పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో తొలుత భారత్ ప్రతిపాదించినట్లుగా గణతంత్ర దినోత్సవాలకు అమెరికా అధ్యక్షుడు బైడెన్, జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌లు హాజరు కాకపోవచ్చని భావిస్తున్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌కు బైడెన్ ముఖ్య అతిథిగా ఆహ్వానాన్ని అంగీకరించారా లేదా అనేది తెలియరాలేదు. అమెరికా ఈ విషయమై ఇప్పటివరకు ఏమీ మాట్లాడలేదు. షెడ్యూల్ ఇబ్బందుల వల్లనే ఆయన రావడం కష్టమవుతుందని భావిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం రోజునే ఆస్ట్రేలియా జాతీయ దినోత్సవమైనందున అల్బనీస్ కూడా రాలేనని చెప్పారు. ఈ నేపథ్యంలో క్వాడ్ సదస్సును వాయిదా వేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

భూమిపై నరకం గాజా!

- ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యలు
- 24గంటల్లో 207మంది మృతి
- కమల్ అద్వాన్ ఆసుపత్రిపై ఇజ్రాయిల్ దాడి

గాజా : ఇజ్రాయిల్ హంతక దాడులతో గాజా 'భూమిపై నరకం' మాదిరిగా తయారైందని ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించింది. దక్షిణ, సెంట్రల్ గాజాల్లో ఇజ్రాయిల్ సైన్యం సాగిస్తున్న దాడుల్లో అనేకమంది మరణించారు. ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని వరుస బాంబు దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ తాజాగా కమల్ అద్వాన్ ఆసుపత్రిపై విరుచుకుపడింది. పేషెంట్ల రూమ్‌లోకి ప్రవేశించి యథేచ్ఛగా సైన్యం కాల్పులు జరిపింది. రోగులు, వైద్య సిబ్బందిని అందరినీ ఆసుపత్రి ఆవరణలో ఒక చోటకు నెట్టి వారిని తనిఖీల పేరుతో వేధించింది. కొందరిని అరెస్టు చేసింది. ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో ఇప్పటికే చాలా ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. దక్షిణ గాజాలో పనిచేస్తున్న ఒకే ఒక ఆసుపత్రి కమల్ అద్వాన్. ఇప్పుడు దానిని కూడా ఇజ్రాయిల్ సైన్యం నాశనం చేసింది. దీనిపై గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఫిర్యాదు చేసింది. గాజాలో ఆరోగ్య సేవలను పూర్తిగా స్తంభింపచేయాలన్నది ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విమర్శించింది. ఇప్పటివరకు 22 ఆస్పత్రులు, 46 ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు దాడులకు గురయ్యాయి. ఆరోగ్య సేవలు పూర్తిగా స్తంభించాయి. దీంతో గాయపడిన వారు చికిత్స కోసం విదేశాలకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రులను చుట్టుముట్టి ఎవరూ లోపలకు వెళ్లకుండా, బయటకు రాకుండా అడ్డుకుంటున్నారు. వైద్య సిబ్బందిపై, రోగులపై తరచుగా కాల్పులు జరుపుతున్నారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. శాంతి కోసం ఐక్యంగా నిలవాలని ఈ సమావేశంలో ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు పిలుపునిచ్చారు. గాజాలో కాల్పుల విరమణ పాటించాలని ఐరాస భద్రతా మండలి ఆమోదానికి పెట్టిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసిన సంగతి తెలిసిందే. గాజాలో ఇజ్రాయిల్ రెండు మాసాలుగా జరుపుతున్న దాడుల్లో ఇప్పటివరకు మొత్తంగా 18,200మంది మరణించారని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

వ్యతిరేకత తప్పించుకునేందుకా!

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకత వ్యక్తమవుతోంది, మంత్రిగా ఉంటూనే చిలకలూరిపేటలో వ్యతిరేకత మూటగట్టుకున్న విడదల రజనీ కీలకమైన గుంటూరులో ఎలా గెలుస్తారని ప్రశ్నిస్తున్నారు. వేమూరు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మేరుగ నాగార్జున, ఎర్రగొండపాలెం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిమూలపు సురేష్ ఆయా నియోజకవర్గాలకు పనికిరారు అనుకుంటే పక్క నియోజకవర్గాల్లో ఎలా గెలుపు గుర్రాలవుతారని అడుగుతున్నారు. రేపల్లె నియోజకవర్గంలో అయితే మార్పు మరింత చర్చనీయాంశమైంది. అక్కడ జగన్ కటుంబానికి నమ్మినబంటుగా అనేక కేసుల్లో ఇరుక్కున్న మోపిదేవి వెంకట రమణారావు మార్పును అక్కడి నాయకత్వం జీర్ణించుకోలేకపోతోంది.

సమరోత్సాహంతో సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

ఆయాలు ఆందోళన చేపట్టారు.

నిరసన కనబడకుండా అనకాపల్లి జిల్లాలో పరదా

అనకాపల్లి జిల్లా రావికమతం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయ సమీపంలో అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. అదే సమయంలో వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్ర ఆ ప్రాంతంలో సాగుతోంది. అంగన్‌వాడీల నిరసన కనబడకుండా ఉండేందుకు పోలీసులు పరదాలు అడ్డంగా కట్టారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ తీరుపై సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మద్దతు

అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్‌పురంలో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సందర్శించి మద్దతు తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన అంగన్‌వాడీల ఆందోళనలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు : కె సుబ్బరావమ్మ

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులోని ఐసిడిఎస్ డైరెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నాలో ఆమె మాట్లాడారు.

రాజస్థాన్ సిఎంగా భజన్‌లాల్ శర్మ

- వసుంధర రాజేకు మొండిచేయి

జైపూర్ : రాజస్థాన్ ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మను బిజెపి ప్రకటించింది. భరత్‌పూర్ నివాసి భజన్ లాల్ శర్మ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాలుగుసార్లు పనిచేశారు. ఇటీవల ఎన్నికల్లో జైపూర్‌లోని సంగనేర్ వంటి సురక్షితమైన స్థానం నుంచి బిజెపి తొలిసారి భజన్ లాల్ శర్మను బరిలో దింపింది. సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్ లాహోటీకి టిక్కెట్ ఇవ్వకుండా, ఆయనను పోటీలో నిలిపింది. కాంగ్రెస్ అభ్యర్థి పుష్పేంద్ర భరద్వాజ్‌పై 48,081 ఓట్ల తేడాతో భజన్‌లాల్ విజయం సాధించారు. ఆయన రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి 1993లో పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎంఎ పొలిటిక్స్) చేశారు. భజన్‌లాల్ శర్మపై ఐపీసీ సెక్షన్ల కింద రెండు కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 353 కింద కేసు నమోదై ఉన్నాయి. (ప్రభుత్వ ఉద్యోగి విధిని నిర్వర్తించకుండా నిరోధించడానికి దాడి లేదా క్రిమినల్ శక్తులకు సంబంధించినది). రెండవ కేసు భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 149 కింద నమోదై ఉన్నది.

రూ.1445 కోట్లతో అదర్ పునావాలా భవనం కొనుగోలు

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన వ్యాక్సిన్ తయారీ సంస్థ సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సిఇఒ అదర్ పూనావాలా తాజాగా లండన్‌లో దాదాపు రూ.1445 కోట్లతో అత్యంత విలాసవంతమైన భవనాన్ని కొనుగోలు చేశారని రిపోర్టులు వస్తున్నాయి. కరోనా కాలంలో కొవిషీల్డ్‌ను వ్యాక్సిన్‌ను సీరం ఇన్‌స్టిట్యూట్ తయారు చేసిన విషయం తెలిసిందే. భారత్‌లో ఈ వ్యాక్సిన్‌ను తొలుత రూ.1400కు ఆ తర్వాత దశలో రూ.600, రూ.225కు విక్రయించి.. భారీగా సంపాదించిన విషయం తెలిసిందే. దీంతో అదర్ పూనావాల బిలియనీర్ల జాబితాలోకి చేరిన విషయం తెలిసిందే. లండన్‌లోని హైడ్ పార్క్ ప్రాంతంలో పోలండ్‌కు చెందిన దివంగత వ్యాపారవేత్త జాన్ కుల్జిక్ కుమార్తె డొమినికా కుల్జిక్ ఉన్న 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని అబెర్‌కాన్వే హౌస్‌ను పూనావాలా కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

జెడ్‌పిఎంలోకి సిఎడిసి ఛైర్మన్

- ఐదుగురు బిజెపి సభ్యులు కూడా..

ఐజ్వాల్ : మిజోరంలోని చక్మా అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ (సిఎడిసి) ఛైర్మన్ కాలీ కుమార్ టోంగ్‌చాంగ్యా తాజాగా జోరం పీపుల్స్ మూమెంట్ (జెడ్‌పిఎం)లోకి చేరారు. మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) సభ్యుడైన ఛైర్మన్ కాలీ కుమార్ టోంగ్‌చాంగ్యాతో పాటు మరో ఐదుగురు బిజెపి సభ్యులు కూడా జెడ్‌పిఎంలోకి చేరారు. కాంగ్రెస్‌కు చెందిన కొంతమంది సిఎడిసి సభ్యులు కూడా జెడ్‌పిఎంలోకి చేరతారనే వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమయితే జెడ్‌పిఎం నేతృత్వంలోనే సిఎడిసి కౌన్సిల్ ఏర్పాటు కానుంది.

శిలాజ ఇంధనాలపై తొలగని అనిశ్చితి!

కాప్ -28 సదస్సు చివరి రోజు వాడి వేడి చర్చలు

దుబాయ్ : కీలకమైన వాతావరణ చర్చలు ముగిసినా కీలక అంశాలపై ధనిక, వర్ధమాన దేశాల మధ్య విభేదాలు అలానే కొనసాగుతున్నాయి.దీంతో ఈ సదస్సు సాధించే ఫలితాలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. భూగోళం వేడెక్కడానికి ముఖ్య కారణాల్లో ఒకటైన శిలాజ ఇంధన వాడకాన్ని తగ్గించాలనే విషయంలో ధనిక దేశాలకు, , వర్ధమాన దేశాలకు మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. నవంబరు 30న ప్రారంభమైన ఈ సదస్సు దాదాపు రెండు వారాల పాటు సాగింది. వారాల తరబడి చర్చలు, ప్రసంగాలు, ప్రదర్శనలు సాగిన తర్వాత మంగళవారం మధ్యాహ్నానికి ముగియాల్సి వుంది. కానీ, బొగ్గు, చమురు, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను త్వరితగతిన తొలగించడంపై ఒక ఒప్పందం కోసం పట్టుబడుతున్న దేశాలకు సోమవారం విడుదల చేసిన ముసాయిదా ఒప్పందం ఆగ్రహం తెప్పించింది. న్యాయమైన, సక్రమమైన, సమానమైన రీతిలో శిలాజ ఇంధనాల వినిమయాన్ని, ఉత్పత్తిని తగ్గించాలని ఆ ముసాయిదా దేశాలను కోరుతోంది. ఇది పనికిమాలిన పత్రంగా ఆ ముసాయిదాను మార్షల్ దీవుల వాతావరణ రాయబారి టీనా స్టీగ్ వ్యాఖ్యానించారు. గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న పారిస్ ఒప్పందం లక్ష్యాన్ని ఇది పరిష్కరించడం లేదని విమర్శించారు. ఇటువంటి చర్చల వల్ల ఎలాంటి న్యాయం జరగదని అన్నారు. ఈ వాతావరణ మార్పులు తమ దేశ భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. దుబాయి డిక్లరేషన్‌పై ఏకాభిప్రాయం కుదరడం కష్టమేనని జర్మనీ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అవసరమైతే సదస్సు పొడిగించినా తమకు ఇబ్బంది లేదన్నారు. కాగా, పలువురు ప్రతినిధుల వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం సవరించిన ముసాయిదాను సదస్సులో ప్రవేశపెడతారని బంగ్లాదేశ్ రాయబారి సాబెర్ చౌదరి చెప్పారు. ఏ మేరకు మెరుగుపరిచారో చూడాల్సి వుందని ఆయన వ్యాఖ్యానించారు. శిలాజ ఇంధనాలను నిర్మూలించడానికి సంబంధించిన ఏ పద ప్రయోగాన్నైనా సరే అడ్డుకోవాల్సిందిగా ఒపెక్ హెడ్ సభ్యదేశాలకు గత వారం ఒక లేఖ రాశారు. అందరికోసం ఒప్పందమనేది వుండాలని సౌదీ అరేబియా పేర్కొంటోంది. శతాబ్దాల తరబడి శిలాజ ఇంధనాల నుండి లాభాలు పొందిన సంపన్న దేశాలు ఇప్పుడు ఇలా వాటిని తిరస్కరించడమన్నది వారికి న్యాయం కాదని కొన్ని వర్ధమాన దేశాలు పేర్కొంటున్నాయి. కొన్ని కీలకమైన అంశాలపై వర్ధమాన దేశాల ఆందోళనలను పరిష్కరించడంలో ఈ ముసాయిదా విఫలమైందని చైనా పర్యావరణ మంత్రి ఝావో యింగ్‌మిన్ విమర్శించారు. ఇది మనుగడ కోసం జరిగే యుద్ధమని అమెరికా వాతావరణ రాయబారి జాన్ కెర్రీ వ్యాఖ్యానించారు.

'జెఎన్‌యు'లో నిరసనలు నిషేధం

- నిబంధనలు ఉల్లంఘిస్తే బహిష్కరణ, రూ.20 వేలు జరిమానా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు) క్యాంపస్‌లో నిరసనలపై నిషేధం విధిస్తూ కొత్త ప్రతిపాదనలను యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ తీసుకొచ్చింది. జెఎన్‌యు అకడమిక్ భవనాలకు 100 మీటర్ల దూరంలో ధర్నాలు చేయడం, పోస్టర్లు వేయడం వంటి నిరసనలను నిషేధించారు. ఇప్పుడు రూ.20 వేల వరకు జరిమానా లేదా బహిష్కరణ చేసే అవకాశం ఉంది. జెఎన్‌యు కొత్త మాన్యువల్ స్పష్టం చేస్తుంది. ఏదైనా 'దేశ వ్యతిరేక' చర్యకు పాల్పడితే రూ.10 వేలు జరిమానా విధిస్తారు.

మాన్యువల్‌లోని కొత్త ఆర్డర్ క్లాస్‌రూమ్‌లు, ల్యాబ్‌లు కాకుండా ఛైర్‌పర్సన్‌లు, డీన్‌లు, ఇతర ముఖ్యమైన ఆఫీస్ బేరర్ల కార్యాలయాలను కలిగి ఉన్న వివిధ డిపార్ట్‌మెంట్ అకడమిక్ భవనాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. అంతకుముందు, హైకోర్టు ఆదేశం ప్రకారం.. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, ప్రాక్టర్ల కార్యాలయాలు ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులకు 100 మీటర్ల పరిధిలో నిరసనలు నిషేధించబడ్డాయి. సవరించిన చీఫ్ ప్రాక్టర్ ఆఫీస్ (సిపిఒ) మాన్యువల్ ప్రకారం, యూనివర్సిటీలో అకడమిక్ భవనాలకు 100 మీటర్ల లోపల నిరసనలు నిషేధించారు. కొత్త మాన్యువల్ ప్రకారం మతం, కులం, వర్గం పట్ల అసహనాన్ని ప్రేరేపించే ఏదైనా చర్య, 'దేశ వ్యతిరేకం'గా భావించే చర్యలకు పాల్పడితే రూ.10 వేలు జరిమానా విధిస్తారు.

అసమ్మతిని అణచివేసే ప్రయత్నం : జెఎన్‌యు ఎస్‌యు

కొత్త నిబంధనలను జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (జెఎన్‌యు ఎస్‌యు) వ్యతిరేకించింది. క్యాంపస్‌లో అసమ్మతిని అణచివేసే ప్రయత్నమని, దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. 'చీఫ్ ప్రాక్టర్ మాన్యువల్ కార్యాలయం తన కొత్త మాన్యువల్‌ను వెంటనే రద్దు చేయాలని విశ్వవిద్యాలయ పరిపాలనను జెఎన్‌యు ఎస్‌యు కోరింది' అని విద్యార్థి సంఘం పేర్కొంది.

పాక్‌లో ఉగ్రవాదుల పంజా

- 25మంది సైనికులు మృతి
- ఎదురు కాల్పుల్లో 27మంది తీవ్రవాదుల హతం

పెషావర్ : పాకిస్తాన్ వాయవ్య సరిహద్దు రాష్ట్రమైన ఖైబర్ ఫఖ్తునువా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ ఖాన్ నగరంలో సోమ, మంగళవారాల్లో జరిగిన మూడు వేర్వేరు దాడుల్లో 25మంది సైనికులు మరణించారు. భద్రతా దళాలు జరిపిన ఎదురు కాల్పుల్లో 27మంది తీవ్రవాదులు హతమయ్యారని పాక్ మిలటరీ మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) తెలిపింది. మంగళవారం తెల్లవారు జామున ఆరుగురు తీవ్రవాదులు దారా బన్ జనరల్ ఏరియాలో భద్రతా బలగాల చెక్‌పోస్టుపై దాడి చేశారు. పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో చెక్‌పోస్టు దాటి లోపలకు వచ్చేందుకు చేసిన ప్రయత్నాన్ని అధికారులు భగ్నం చేయడంతో పోస్టు వద్దనే వాహనాన్ని పేల్చివేశారు. ఫలితంగా సంభవించిన పేలుళ్లలో భవనం కుప్పకూలింది. 23మంది సైనికులు మరణించారు. ఆ వెంటనే కొంతమంది తీవ్రవాదులు కాల్పులు కూడా జరిపారు. ఇది తమ పనేనని పాకిస్తానీ తాలిబాన్ గ్రూపు తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ (టిటిపి) అనుబంధ తీవ్రవాద సంస్థ తెహ్రీక్ ఇ జిహాద్ పాకిస్తాన్ (టిజెపి) ప్రకటించింది.. ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా భద్రతా దళాలు దారా జిందా ఏరియాలో జరిపిన సైనిక చర్యలో 17మంది తీవ్రవాదులు హతమయ్యారని ఐఎస్‌పిఆర్ తెలిపింది. మరో రెండు ఘటనల్లో మరో పది మంది ఉగ్రవాదులు మరణించారు. ఘటనా స్థలిలో పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిని ప్రధాని అన్వరాల్ హక్ కాకర్, అధ్యక్షుడు అరిఫ్ అల్వి, పలువురు రాజకీయ నేతలు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి పిరికిపంద చర్యలతో సైన్యం నైతిక స్థైర్యం కోల్పోదన్నారు.

అవినీతి కేసులో నవాజ్ షరీఫ్ నిర్దోషి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పిఎంఎల్-ఎన్) అధినేత, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను అల్ అజీజియా స్టీల్ మిల్ అవినీతి కేసులో నిర్దోషిగా మంగళవారం ఇస్లామాబాద్ హైకోర్టు ప్రకటించింది. దీంతో రాబోయే ఎన్నికల్లో పార్టీకి ఆయన నాయకత్వం వహించడానికి గల ప్రధాన చట్టపరమైన అడ్డంకి తొలగిపోయింది.

చైనా-వియత్నాం మధ్య బంధం మరింత బలోపేతం

చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ పర్యటన

హనోయ్ : చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ఆరేళ్ల తరువాత వియత్నాంలో పర్యటనకు మంగళవారం నాడిక్కడకు చేరుకున్నారు. పొరుగు కమ్యూనిస్టు దేశంతో సంబంధాలను మరింత బలోపేతం గావించేందుకు ఆయన ఈ పర్యటనకు వచ్చారు. భాగంగా వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంగుయెన్ ఫూ ట్రాంగ్, అధ్యక్షుడు వో వాన్ తుయాంగ్, ప్రధాని ఫామ్ మిన్హ్ చిన్హ్‌లతో జిన్‌పింగ్ సమావేశమవుతారని వియత్నాం విదేశాంగ శాఖ తెలిపింది. చైనా-వియత్నాం సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు జిన్‌పింగ్ పర్యటన ఉద్దేశించబడిందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వాంగ్ లెన్‌బిన్ పేర్కొన్నారు. చైనా దంపతులకు హనోయ్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయం నుండి అధ్యక్ష భవనానికి వెళ్లే దారి పొడవునా చైనా, వియత్నాం పతాకాలను చేబూని పిల్లలు, పెద్దలు చేతులూపుతూ జిన్‌పింగ్‌కు స్వాగతం పలికారు. చైనా గత 15ఏళ్ళుగా వియత్నాంకు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామిగా వుంది. ఆగ్నేయాసియాలో భద్రత, ఆర్థిక వ్యవహారాల్లో వియత్నాం కీలక వ్యూహాత్మక పాత్ర పోషిస్తోంది. సైద్ధాంతికంగా వియత్నాం, చైనాకు సన్నిహితంగా వుంటుంది.

కమ్యూనిస్టు పార్టీ పాలనలోని వియత్నాంకు చైనాతో బలమైన సంబంధాలే వున్నాయి. సరిహద్దు గుండా రైలు మార్గం, వాణిజ్యం అభివృద్ధి వంటి అంశాలతో సహా పలు అంశాలకు సంబంధించిన 37 ఒప్పందాలపై ఇరు దేశాల నేతలు సంతకాలు చేయనున్నారు. సెప్టెంబరులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వియత్నాంలో పర్యటించారు. నవంబరులో జపాన్, వియత్నాం ఆర్థిక, భద్రతా సంబంధాలను బలపరుచుకున్నాయి.

అమ్మ

తీయనైన అనురాగం అమ్మ
తొమ్మిది నెలలు మోసేది అమ్మ
కడుపులో ఉన్నప్పుడు
కాళ్లను కదిలిస్తే నవ్వుతుంది అమ్మ
తీయనైన పలకరింపు అమ్మ
మాటలు నేర్పేది అమ్మ
నడక నేర్పించేది అమ్మ
అమ్మ నవ్వితే ఆనందంగా ఉంటుంది
అమ్మ లేనిదే లోకం లేదు
అమ్మను మించిన దైవం లేదు
అమ్మ ఉంటేనే ఆనందం
అమ్మ ఎప్పుడూ ఒక అద్భుతం!

మాలోతు నిఖిత,
తొమ్మిదో తరగతి,
జెడ్‌పిహెచ్ హవేలీ ఘణపూర్,
మెదక్ జిల్లా.



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

జె.రుచిత,
9వ తరగతి,
రాయిలాపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లలు కనిపించకుండా పోతున్నారు...

దేశంలో ఎక్కడో ఓ చోట, పిల్లలు కనిపించకుండా పోతున్నారని వార్తలు వింటుంటాం. ఇంటి ముందు ఆడుకుంటున్నప్పుడు, స్కూలు నుంచి ఇంటికి వచ్చేటప్పుడు ఇలా ఏదో ఒక సందర్భంలో కళ్లముందే కంటిపాపలు కనుమరుగైపోతున్నారని తెలుసుకొని విచారిస్తాం. అమ్మానాన్న, బంధువులు, పోలీసులు రోజుల తరబడి వెతుకులాడినా కొందరి పిల్లల జాడ దొరకదు. అది అమ్మానాన్నలకు, పిల్లలకు ఎంతటి వేదన!

మనదేశంలో తప్పిపోతున్న పిల్లల సంఖ్య గడిచిన ఐదేళ్లుగా విపరీతంగా పెరిగిపోయింది. జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) తాజా నివేదిక ప్రకారం ... దేశంలో ఈ ఏడాది 47 వేల మంది చిన్నారులు అదృశ్యమయ్యారు. వారిలో 71.4 శాతం మంది బాలికలే ఉన్నారు.

ఈ సంఖ్య 2021 కంటే 2022లో 7.5 శాతం పెరుగుదల చూపించింది. అదే నిష్పత్తి 2020 కంటే 2021లో 30.8 శాతం, 2017 కంటే 2018లో 5.6 శాతం, 2019లో 8.9 శాతం, 2020లో 19.8 శాతం పెరుగుతూ ఉంది.

తాజా నివేదిక ఏం చెప్పిందంటే..

2022 ఏడాదికి గాను ఎన్‌సిఆర్‌బి డిసెంబరు 3న ఈ నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం గతేడాది మొత్తం 83, 350 చిన్నారులు కనిపించకుండా పోయారు. వారిలో 20,380 మంది బాలురు, 62,946 మంది బాలికలు, 24 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అదే నివేదికలో రక్షించబడిన వారి వివరాలు కూడా పొందుపర్చారు. గతేడాది మొత్తం 80,561 మంది పిల్లలను సంరక్షించారు. వారిలో 20,254 మంది బాలురు, 60,281 మంది బాలికలు, 26 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

ఇంకా ఈ నివేదికలో ఏం చెప్పారంటే.. కనిపించకుండా పోయిన మొత్తం చిన్నారుల్లో 76,069 మంది కిడ్నాప్‌కి గురయ్యారు. ఇందులో 62,099 మంది బాలికలు. 51,100 మంది మైనర్లు కిడ్నాపింగ్ వల్ల కోలుకోలేని బాధితులుగా జాబితా చేశారు. వీరిలో 40,219 మంది అంటే 78.7 శాతం మంది బాలికలు.

ఈ గణాంకాలన్నీ తప్పిపోయిన పిల్లలను కిడ్నాప్‌కి గురైనట్లు భావించి పోలీసులు ఎఫ్ఐఆర్ చేసిన నివేదికల ఆధారంగా తయారు చేసినవి. ఆ నివేదికల ప్రకారం 2022లో 33,650 మంది, 2021లో 29,364 మంది, 2020లో 22,222 మంది, 2019లో 29,243 మంది, 2018లో 24,429 మంది చిన్నారులు కిడ్నాప్‌కి గురైనట్లు ఎఫ్ఐఆర్ నమోదైంది.

కిడ్నాప్‌కి గురైన పిల్లలను రక్షించలేని పక్షంలో వారంతా వీధుల్లో యాచన చేసేవారుగా, నేరస్తులుగా, నేరసంబంధ కార్యక్రమాల్లో భాగంగా, వేశ్యాగృహాలకు విక్రయించబడడం వంటి అక్రమ కార్యకలాపాలకు బలౌతారన్నది వాస్తవం.

నివారణ ఎలా..?

'పిల్లలు తప్పిపోయిన 24 గంటలు చాలా కీలకం. పోలీసు విచారణ వేగవంతంగా పనిచేయాలి. అప్పుడే పిల్లలను సకాలంలో రక్షించగలం. ఒక్కోసారి ఇరుగుపొరుగు వారు, పిల్లలతో బాగా స్నేహంగా మెలిగేవారు కూడా ఇటువంటి దారుణాలకు పాల్పడుతుంటారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ విస్మరించకూడదు.

పిల్లలతో సాన్నిహిత్యం ఉన్న వారిపై కూడా నిఘా పెట్టాలని చైల్డ్ ట్రాఫికింగ్‌కి వ్యతిరేకంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థ 'శక్తి వాహిని' నిర్వాహకుడు రిషి కాంత్ అంటున్నారు.

రాష్ట్రాల వారీగా ...

ఎన్‌సిఆర్‌బి తాజా నివేదిక ప్రకారం ... పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధికంగా చిన్నారులు అదృశ్యమైనట్లు తేలింది. వారిలో బాలురు కంటే బాలికలే అధికం. 2022 గణాంకాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 12,455 మంది చిన్నారులు అదృశ్యమయ్యారు. వారిలో 1,884 మంది బాలురు, 10,571 మంది బాలికలు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో ఆ సంఖ్య 11,352 మందికి చేరింది. వారిలో 2,286 మంది బాలురు, 9,006 మంది బాలికలు ఉన్నారు. 2018 నుండి ఈ సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎన్‌సిఆర్‌బి నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి.

వాస్తవాలు ఇంత ఘోరంగా ఉంటే 2022లో ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం 424 మంది చిన్నారులు మాత్రమే అక్రమ రవాణా చేయబడ్డారని నమోదైంది. 11, 10 ఏళ్ల బాలికలు వేశ్యాగృహాలకు విక్రయించబడినట్లు రికార్డు చేశారు. ఈ గణాంకాలను చూస్తుంటే విచారణలో ఎంత అలసత్వం ప్రదర్శిస్తున్నారో అర్థమవుతుంది.

కాప్ సదస్సులో గళమెత్తిన మణిపూర్ బాలిక

'మన భవిష్యత్తు కోసం మన భూగ్రహాన్ని రక్షించండి. శిలాజ ఇంధనాలకు ముగింపు పలకండి' అంటూ తలపై ప్లకార్డు పట్టుకొని 12 ఏళ్ల లిసీప్రియా కంగుజం, దుబాయ్ వేదికగా 'కాప్-28' ప్రపంచ వాతావరణ సదస్సులో గళమెత్తింది. తనను వారించ వచ్చిన పెద్దల నుండి తప్పించుకుంటూ, స్టేజిపై అటూ ఇటూ తిరుగుతూ, ఇంధన వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఎత్తిచూపింది. నివారణా చర్యలు తీసుకోమని సభ్యదేశాలకు సూచించింది. లిసి ప్రసంగించినంత సేపూ వేదిక నుండి తనని దింపేంచేందుకు నిర్వాహకులు తెగ ప్రయత్నం చేశారు. అయినా తనని ఆపలేకపోయారు. తాను చెప్పాల్సింది చెప్పి, లిసి, స్టేజి దిగిపోయింది.

అక్కడున్న పెద్దలంతా లిసి సాహసానికి ముగ్ధులయ్యారు. ఆమె ధైర్యానికి తమ చప్పట్లతో ప్రశంసించారు. ఆ వేదికమొత్తం కరతాళ ధ్వనులతో నిండిపోయిన వేళ, 'కాప్ 28' డైరెక్టర్ జనరల్ అంబాసిడర్, మరొక్కసారి సభికులతో ఆ చిన్నారికి చప్పట్లు కొట్టించారు. ఇంతటి సాహసం చేసిన ఆ చిన్నారి మన దేశం నుండి కాప్ సదస్సుకు హాజరైంది. ఆరునెలలకు పైగా అల్లర్లతో అట్టుడికిపోతున్న మణిపూర్ వాసి ఆ బాలిక.

నవంబర్ 30న ప్రారంభమైన 'కాప్ 28' సదస్సు డిసెంబర్ 12తో ముగిసింది. దీనికి 190 దేశాల నుంచి 60 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈస్ట్ తైమూర్ ప్రత్యేక రాయబారిగా మన లిసీ సదస్సుకు హాజరైంది.

పర్యావరణంపై గళమెత్తడం లిసీకి కొత్తకాదు. చిన్నవయసు నుంచే వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ వంటి అంశాలపై ఉద్యమిస్తోంది. ఎన్నో వేదికలపై ఉపన్యాసాలిచ్చింది. 'క్లైమేట్ ఛేంజ్ లా' తీసుకురావాలంటూ మన పార్లమెంటు ముందూ ప్రదర్శనలు చేసింది. లిసీ కృషికి గాను 'వరల్డ్ చిల్డ్రన్ పీస్ ప్రైజ్ 2019' తనని వరించింది.

'ఈ రోజు వాతావరణ సంక్షోభానికి ప్రధాన కారణం బొగ్గు, చమురు, గ్యాస్. వీటిని నిర్మూలించడానికి ప్రభుత్వాలు కలిసి పని చేయాలి. ఈ రోజు మీ చర్యే రేపటి మా భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మేము ఇప్పటికే వాతావరణ మార్పుల బాధితులం. నేను, నా భవిష్యత్ తరాలు అదే పర్యవసానాలను ఎదుర్కోవాలి. నాయకుల వైఫల్యాలకు లక్షలాది మంది అమాయక పిల్లల ప్రాణాలను బలి ఇవ్వడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

'వాతావరణ వైపరీత్యాల కారణంగా నాలాంటి లక్షలాది మంది పిల్లలు తమ జీవితాలను కోల్పోతున్నారు, వారి తల్లిదండ్రులను కోల్పోతున్నారు, నివాసాలను కోల్పోతున్నారు. ఇది నిజమైన వాతావరణ అత్యవసర పరిస్థితి. యుద్ధాలకు బిలియన్ల డాలర్లు ఖర్చు చేసే బదులు, ఆకలిని అంతం చేయడానికి, విద్యను అందించడానికి, వాతావరణంతో పోరాడటానికి ఖర్చు చేయండి' అంటూ ఎన్నోసార్లు తన గళాన్ని వినిపించిన లిసీ, కాప్ సదస్సులో తన ప్రసంగాన్ని ముగించేముందు, 'మేము పీల్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు, జీవించడానికి స్వచ్ఛమైన గ్రహం కావాలి. వీటన్నింటినీ కోరడం మా ప్రాథమిక హక్కు' అని తీవ్ర స్వరంతో నినదించింది.

'నేను నిరసన తెలియజేయడంతో వారు నన్ను 30 నిమిషాల పాటు అదుపులోకి తీసుకున్నారు. శిలాజ ఇంధనాలు వాడొద్దని చెప్పడమే నేను చేసిన నేరం. మీరు నిజంగా శిలాజ ఇంధనాలను వ్యతిరేకిస్తే.. నాకు మద్దతు ఇవ్వండి. నిబంధలకు విరుద్ధంగా ఐరాస ప్రాంగణంలోనే బాలల హక్కుల ఉల్లంఘన జరిగింది. ఐరాస వద్ద నా గళాన్ని వినిపించే హక్కు ఉంది' అని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌ను ట్యాగ్ చేస్తూ ఈ సంఘటన తరువాత లిసీ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. దేశంలో ఎంతోమంది చిన్నారుల ప్రతినిధిగా తన గళాన్ని వినిపించిన లిసీ సాహసానికి మనమూ జైకొడదాం.

హైదరాబాద్‌లో షూటింగుల సందడి

నాగార్జున హీరోగా, ఆషిక రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్న 'నా సామిరంగా' సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ ఇద్దరి కాంబినేషన్లో ప్రస్తుతం షూట్ చేస్తున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న 'గుంటూరు కారం' సినిమా కూడా హైద్రాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటోంది.

హారిక హాసిని క్రియేషన్స్ బ్యానర్ మీద నిర్మితమవుతున్న ఈ సినిమాలో శ్రీ లీల, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. సోమవారం, పబ్లో కొన్ని షాట్స్ చిత్రీకరించగా మంగళవారం కూడా అదే సాంగ్‌కి సంబంధించి సిటీలోని కొన్ని ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' సినిమా షూటింగ్, రామోజీ ఫిలిం సిటీలో శరవేగంగా జరుగుతోంది. రష్మిక హీరోయిన్‌గా వస్తున్న 'గర్ల్ ఫ్రెండ్' సినిమా షూటింగ్ కూడా ప్రస్తుతం హైదరాబాదులో జరుగుతోంది.

మీ సినిమాలో నాకూ అవకాశమివ్వండి!

'రిషభ్‌శెట్టి, హోంబాలే ఫిల్మ్స్ కాంబినేషన్‌లో 'కాంతారా : చాప్టర్-1' కోసం ఆడిషన్స్ జరుగుతున్నాయని నాకు తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావాలని నాకు ఆశగా ఉంది. ఇటీవల విడుదలైన నా చిత్రం 'మంగళవారం'లో నటనకు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు వచ్చాయి. మీరు కాస్త సమయం వెచ్చించి నేను నటించిన సినిమా చూస్తే, మీకు కృతజ్ఞతలు చెప్పుకొంటాను. ఈ ప్రాజెక్ట్ కోసం ఆడిషన్ ఇవ్వడానికి ఏం చేయాలో దయచేసి చెప్పండి. నా పేరు రీపోస్ట్ చేస్తూ సహకరించే అభిమానులకు నా ధన్యవాదాలు' అని పాయల్ రాజ్‌పుత్ ట్విట్టర్ వేదికగా 'కాంతార : చాప్టర్-1' చిత్ర బృందాన్ని కోరారు.

అడవి శేషుకు జోడీగా శృతిహాసన్

హీరోగా అడివి శేష్, హీరోయిన్‌గా శృతిహాసన్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం త్వరలోనే షూటింగ్ జరుపుకోనుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. డీవోపీగా పనిచేసిన షానీల్‌కు దర్శకుడిగా ఇది తొలి చిత్రం. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు అధికారికంగా ఎంపికైన 'లైలా' అనే ప్రశంసలు పొందిన షార్ట్ ఫిల్మ్‌కు ఆయన దర్శకత్వం వహించారు. 'సినిమాలోని ప్రతి ఫ్రేమ్, డైలాగ్, సన్నివేశాన్ని హిందీతో పాటు తెలుగులో విడివిడిగా చిత్రీకరిస్తాం. ప్రతి భాష, సాంస్కృతిక ప్రత్యేకత బట్టి దీనిని ట్రీట్ చేస్తున్నాం' అని చిత్ర నిర్మాతలు ప్రకటించారు.

19న 'హను-మాన్' ట్రైలర్ విడుదల

తేజ సజ్జ హీరోగానూ, అమృత హయ్యర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'హను-మాన్'. ఈ సినిమా ట్రైలర్‌ను ఈనెల 19న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రతినిధులు ప్రకటించారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా అస్రిన్‌రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్‌గా వెంకట్ కుమార్ జెట్టి, అసోసియేట్ ప్రొడ్యూసర్‌గా కుశాల్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరహరి, అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్ త్రయం సంగీతం అందించారు. ఈ మాగ్నమ్ ఓపస్‌కి సినిమాటోగ్రఫీ శివేంద్ర. ప్రొడక్షన్ డిజైనర్ శ్రీనాగేంద్ర తంగాల. వినయ్ రాయ్ విలన్‌గా కనిపించనున్నారు. వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జనవరి 12న ఈ సినిమా విడుదల కానుందని యూనిట్ ప్రతినిధులు పేర్కొన్నారు.

అసలు సిసలైన హారర్ చిత్రం 'పిండం'

హారర్ సినిమాలంటే నాక్కూడా భయమే. కానీ అలాంటి సినిమాల్లో అనవసరమైన కామెడీ, రొమాన్స్, సాంగ్స్‌ను ఇరికిస్తుంటారు. హారర్ జానర్ అంటే హారర్ ఉండాలి. సాయికిరణ్ దైదా పిండం కథ చెప్పగానే నచ్చింది. కొత్త దర్శకుడైనప్పటికీ ఆయనకి ఎంతో క్లారిటీ ఉంది. సాయి కిరణ్ తీసిన స్మోక్ అనే షార్ట్ ఫిల్మ్ చూసి ఆయన ప్రతిభపై నమ్మకంగా కలిగింది. నిర్మాత యశ్వంత్ ఈ కథను నమ్మి సినిమా చేశారు. ఇది ఖచ్చితంగా థియేటర్‌లో చూడాల్సిన అసలైన హారర్ సినిమా. ఈ కథ 1930, 1990, ప్రస్తుతం ఇలా మూడు కాలాల్లో జరుగుతుంది. ఇందులో చాలా కథ ఉంటుంది. పిండం టైటిల్‌తో కూడా కథ ముడిపడి ఉంటుంది' అని హీరో శ్రీరామ్ అన్నారు. శ్రీరామ్, రవి జంటగా ఈ సినిమాలో నటించారు. ఈ సినిమా ఈనెల 15న విడుదల కానున్న నేపథ్యంలో శ్రీరామ్ విలేకరులతో మాట్లాడారు.

రెండో టీ20 సఫారీలదే

రికూ సింగ్, సూర్యకుమార్ మెరుపులు వృథా

గ్వెబెర్హా : భారత్‌తో జరిగిన రెండో టీ20లో 5 వికెట్లతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించడంతో సఫారీల ముందు ముందు 152 పరుగులు లక్ష్యాన్ని నిర్దేశించారు. మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. ఈ లక్ష్యాన్ని 5 వికెట్లు కోల్పోయి ఇంకా ఏడు బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా అందుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ దిగిన భారత్ 19.3 ఓవర్లు ముగిసే సరికి ఏడు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఈ తరువాత వర్షం కురియడంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. వర్షం వెలిసిన తరువాత అంపెర్లు దక్షిణాఫ్రికా ముందు 152 పరుగుల లక్ష్యాన్ని ఉంచారు.

కదం తొక్కిన రికూ సింగ్-సూర్యకుమార్ యాదవ్

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలో భారీ దెబ్బ తగిలింది. ఓపెనర్లు జైస్వాల్, శుభ్‌ం గిల్ డకౌటయ్యారు. ఈ దశలో తిలక్‌వర్మకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జతకలిశాడు. 29 పరుగులు వ్యక్తిగత పరుగుల వద్ద మూడో వికెట్‌గా తిలక్‌వర్మ అవుటయ్యాడు. దీంతో సూర్యకుమార్‌కు రికు సింగ్ జతకలిశాడు. ఈ జోడీ ధాటిగా ఆడింది. దీంతో 13 ఓవరుల ముగిసే సరికి భారత్ 3 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. తరువాత ఓవర్‌లోనే సూర్యకుమార్ 56 పరుగులు వ్యక్తిగత స్కోరు వద్ద నాలుగో వికెట్‌గా అవుటయ్యాడు. తరువాత వచ్చిన జితేష్ శర్మ (1), రవీంద్ర జడేజా (19), అర్షదీప్ సింగ్ (0) నిరాశ పర్చారు. ఆట ముగిసే సరికి రికూ సింగ్ 68 పరుగులుతో నాటౌట్‌గా ఉన్నాడు.

సూర్యకుమార్ ఖాతాలో కొత్త రికార్డు

మంగళవారం రెండో టీ20లో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో 15 పరుగులు చేయడంతో టీ20ల్లో 2000 పరుగుల పూర్తి చేసుకున్నాడు. అలాగే బంతుల పరంగా అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా 2 వేల మార్కును తాకిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. కేవలం 1164 బంతుల్లోనే 2000 పరుగుల సాధించాడు. అంతకుముందు ఈ రికార్డు ఆసీస్ మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ పేరిట ఉండింది.

ఫించ్ 1283 బంతుల్లో 2000 పరుగుల మార్కును దాటాడు. అలాగే సూర్య 56 ఇన్నింగ్స్‌ల్లో ఈ మార్కును అందుకున్నాడు. భారత్ నుంచి అంతర్జాతీయ టీ20ల్లో 2 వేల పరుగులు పూర్తి చేసిన నాలుగో ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. విరాట్ కోహ్లి (107 ఇన్నింగ్స్‌ల్లో 4008 పరుగులు), రోహిత్ శర్మ (140 ఇన్నింగ్స్‌ల్లో 3853 పరుగులు), కేఎల్ రాహుల్ (68 ఇన్నింగ్స్‌ల్లో 2256 పరుగులు) భారత్ తరఫున ఇప్పటికే ఈ ఫీట్‌ను సాధించారు.

డచ్‌కు షాక్

సెమీస్‌కు జూనియర్ హాకీ జట్టు

కౌలాలంపూర్ : మలేషియాలో జరుగుతున్న పురుషుల జూనియర్ ప్రపంచకప్ 2023లో భారత హాకీ జట్టు సెమీస్‌కు దూసుకెళ్లింది. మంగళవారం అత్యంత ఉత్కంఠగా సాగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై భారత్ 4-3తో భారత్ విజయం సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ 3వ స్థానంలో ఉండగా, నెదర్లాండ్స్ 4వ స్థానంలో ఉంది. అయితే మంగళవారం మ్యాచ్ ప్రారంభంలో డచ్ ఆధిపత్యం ప్రదర్శించింది. దీంతో తొలి అర్ధభాగంలో 0-2తో వెనుకబడి ఉన్న భారత్, మూడో క్వార్టర్ ముగిసే సరికి 3-2తో పై చేయిలో నిలిచింది. అయితే మ్యాచ్ కొది సేపటిలో ముగిస్తుందనగా డచ్ జట్టు గోల్ చేయడంతో మ్యాచ్ స్కోరు 3-3తో సమంగా నిలిచింది. మ్యాచ్ మరో మూడు నిమిషాల్లో ముగుస్తుందనే సమయంలో కెప్టెన్ ఉత్తమ్ సింగ్ గోల్ సాధించడంతో భారత్ విజయం సాధించింది. ఈ నెల 14న జరిగే సెమీస్‌లో జర్మనీతో భారత్ తలపడుతుంది.

ఐపిఎల వేలానికి 333మంది క్రికెటర్లు

ముంబయి : ఈ నెల 19న జరిగే ఐపిఎల్ వేలంలో మొత్తం 333 మంది అమ్మకానికి ఉంటారు. అయితే ఖాళీలు 77 మాత్రమే. హర్షల్ పటేల్, శార్దూల్ ఠాకూర్, ఉమేశ్ యాదవ్ కనీస ధర రూ.2 కోట్లు ఉన్న ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. రెండేళ్ల కింద జరిగిన వేలంలో హర్షల్ రూ.10.75 కోట్లకు అమ్ముడుపోయాడు. ఐపిఎల్ పాలకవర్గం మొత్తం 1166 మందితో కూడిన జాబితాను ఫ్రాంఛైజీలకు అందించింది. ఆటగాళ్లపై ఫ్రాంఛైజీల ఆసక్తి ఆధారంగా జాబితాను 333కు కుదించింది. ఇందులో 214 మంది భారతీయులు, 119 మంది విదేశీయులు, అసోసియేట్ దేశాల నుంచి ఇద్దరు ఉన్నారు. వేలంలో ఖర్చు పెట్టడానికి ఫ్రాంఛైజీల వద్ద మొత్తం రూ.262.95 కోట్లు ఉన్నాయి. మొత్తం 77 మంది నుంచి గరిష్టంగా 30 మంది విదేశీ క్రికెటర్లను జట్లు కొనుక్కోవచ్చు. ఆసీస్ ఆటగాళ్లు కమిన్స్, ట్రావిస్ హెడ్, ఇంగ్లిస్, మిచెల్ స్టార్క్‌లకు మంచి డిమాండ్ ఉండనుంది. వీళ్ల కనీస ధర రూ.2 కోట్లు. న్యూజిలాండ్ స్టార్ రచిన్ రవీంద్ర కనీస ధర రూ.50 లక్షలు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68